


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

# నిరుపేదను నిలబెడదాం!




- కూటమి లక్ష్య సాధనకు పెట్టుబడులతో కలసిరండి
- వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే భారీ ప్రోత్సాహకాలు
- రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములై.. మీరూ ఎదగండి
- ధనిక పేదల మధ్య అసమానతలు తొలగించడమే నా లక్ష్యం
- ఫిక్కి జాతీయ కార్యవర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- ప్రభుత్వ ఆలోచనలను సమగ్రంగా వివరించిన సీఎం

2



## ప్రజాస్వామ్యంలో.. నియంతలకు చోటులేదు!

సంవిధాన్ హత్య దివస్‌లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

3

## పీ-4లో మార్గదర్శుల సంఖ్యపెంచాలి

- ఎన్ఆర్ఐల భాగస్వామ్యం పెంచేందుకు విదేశాల్లో పీ-4 సలహాదారుల నియామకం
- పీ-4పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం



4

ఇకపై ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి..

## ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్

- కూటమి ప్రభుత్వ విజయాలను జులై 2నుంచి ఇంటింటికీ తీసుకెళ్లండి
- కూటమిలో మనది పెద్దన్న పాత్ర
- మచిలీపట్నం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్

- వివరాలు 5 లో..

పిల్లలను చదివించేందుకు..

## ఏ తల్లీ ఇబ్బంది పడకూడదనే!

- తల్లికి వందనం అమలుపై మంత్రి లోకేష్
- మహిళల గౌరవం పెరిగేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది
- మా కుటుంబంలో మహిళల త్యాగాల వల్లే మేం ఈ స్థాయిలో ఉన్నాం
- మా అమ్మ త్యాగం వల్లే చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారు
- మచిలీపట్నంలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం పలికిన తల్లికి వందనం లబ్ధిదారులు

6





సమాజంలో అన్ని సమస్యలకు..

## విద్యతోనే పరిష్కారం!

- విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ పిలుపు
- కృష్ణా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొన్న మంత్రి

- వివరాలు 8 లో..

## శభాష్ చంద్రబాబు, లోకేష్

- వారిని చూసి మిగతావారు నేర్చుకోవాలి
- విశాఖలో అద్భుతంగా యోగా డే నిర్వహణ
- కేంద్ర కేబినెట్ భేటీలో ప్రధాని మోదీ ప్రశంసలు



- వివరాలు 10 లో..

విద్వేషం, విధ్వంసమే

## వైసీపీ ఎజెండా

- కూటమి పాలనలో ఆటలు సాగవు
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే వదిలిపెట్టం
- హోంమంత్రి వంగలపూడి అనిత



- వివరాలు 10 లో..



విశ్వ వినువీధుల్లో

## భారత కీర్తిపతాక రెపరెపలు

**రోదసీలోకి శుభాంశు పయనం**

భారత అంతరిక్ష చరిత్రలో ఇదో చారిత్రాత్మక ఘట్టం. విశ్వవినువీధుల్లో దేశ కీర్తి పతాకం సగర్వంగా ఎగిరేలా కోట్లాది భారతీయుల కలలు, ఆకాంక్షలను మోసుకుంటూ భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలో అడుగిడనున్నారు. శుభాంశు శుక్లా కెప్టెన్‌గా హంగెరీ, పోలాండ్, అమెరికా దేశాల వ్యోమగాముల బృందం బుధవారం మధ్యాహ్నం ఫ్లోరిడాలోని నాసా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని (ఐఎస్ఎస్)కి పయనమయ్యారు. వీరి వ్యోమనౌక గురువారం సాయంత్రం ఐఎస్ఎస్‌తో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందానికి రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## నీతోపాటు భారతీయుల కలలు ఆకాశంలోకి..

**శుభాంశు శుక్లా అంతరిక్ష యానంపై సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యానంపై సీఎం చంద్రబాబు ఆనందంతో కూడిన భావోద్వేగభరిత పోస్టు పెట్టారు. ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ 'ఇస్రోలోని మొదటి వ్యోమగామి, భారత వైమానిక దళానికి చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను తీసుకుని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన యాక్సియం-4 మిషన్ తన ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడు.. బిలియన్ల భారతీయుల కలలు ఆయనతోపాటు ఆకాశానికి ఎగిరాయి. యాక్సియం-4 సిబ్బంది సురక్షితమైన ప్రయాణం, ఐఎస్ఎస్‌లో విజయవంతమైన డాకింగ్‌ను కోరుకుంటున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు.



## దేశానికే గర్వకారణం

- శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రపై మంత్రి లోకేష్ అభినందనలు

- వివరాలు 4 లో..

# నిరుపేదను నిలబెడదాం!

- కూటమి లక్ష్య సాధనకు పెట్టుబడులతో కలిసిరండి
- వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే భారీ ప్రోత్సాహకాలు
- రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములై.. మీరూ ఎదగండి
- ధనిక పేదల మధ్య అసమానతలు తొలగించడమే నా లక్ష్యం
- ఫిక్కి జాతీయ కార్యవర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- ప్రభుత్వ ఆలోచనలను సమగ్రంగా వివరించిన సీఎం




అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే ఎక్కువ ప్రోత్సాహకాలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఫిక్కి జాతీయ కార్యవర్గ సమావేశంలో చంద్రబాబు కీలకోపన్యాసం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలను ఫిక్కి ప్రతినిధులకు.. సమావేశానికి హాజరైన వివిధ కంపెనీలకు చెందిన యాజమాన్యాలకు సీఎం వివరించారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏయే రంగాలపై ఉన్నాయనే విషయాన్నీ పెట్టుబడిదారుల దృష్టికి తీసుకెళ్లారు. పాలసీ మేకర్‌గా పేదరికంలేని సమాజాన్ని భావితరాలకు అందివ్వడమే తన బాధ్యతని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పేదలకు- ధనవంతులకు మధ్య అంతరాలను తగ్గించాలంటూ చంద్రబాబు భావోద్వేగంగా ప్రసంగించారు. గత ఐదేళ్ల పాలనను పెట్టుబడిదారులు మరిచిపోవాలని.. ఆ భూతం మళ్లీ రాదని.. పెట్టుబడిదారులకు ఎటువంటి భయాలు లేకుండా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టుకోవచ్చని భరోసానిచ్చారు. పెట్టుబడులు మొదలుకుని రాజకీయాల వరకు.. చరిత్ర మొదలుకుని భవిష్యత్తు అంచనాల వరకూ ఇలా వివిధ అంశాలపై చంద్రబాబు తన అంతరంగాన్ని పారిశ్రామికవేత్తలకు వివరించారు.

## పెట్టుబడులు రావాలి... పేదరికం పోవాలి...

రాష్ట్రంలో పెట్టుబడులకు చాలా అవకాశాలున్నాయని ఫిక్కి జాతీయ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోంది. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలకు పెట్టుబడులు వచ్చేలా పాలసీలు తెస్తున్నాం. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పే కంపెనీలకు ఎక్కువ ప్రోత్సాహకాలిస్తాం. ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో పెట్టుబడులు పెట్టండి. రాయలసీమ ప్రాంతం గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, హైటెక్ ఇండస్ట్రీస్, ఏరో స్పేస్ రంగాలకు అనువుగా ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు గూగుల్‌వంటి సంస్థలు రానున్నాయి. అలాగే విశాఖ కేంద్రంగా సీ కేబుల్ వేయనున్నారు. సింగపూర్- విశాఖకు సీ-కేబుల్ వేస్తున్నారు. ఇక ఈ ప్రాంతంలో కెమికల్, ఫార్మా, టూరిజం, స్టీల్ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి అనువుగా ఉంటుంది. గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు అవకాశం ఉంటుంది. అమరావతి, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏఐ, క్వాంటం వ్యాలీ.. ఇన్నోవేషన్స్ వంటి అంశాలపై ఫోకస్ పెడుతున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మీకు అనువైన ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టండి. రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయండి. మీరు అభివృద్ధి చెందండి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ప్రభుత్వానికి సంపద సృష్టి మీ ద్వారా జరుగుతుంది. ఆ సంపదను పేదలకు సంక్షేమ రూపంలో అందిస్తాం. ప్రభుత్వాధినేతగా పేదరికంలేని సమాజాన్ని భావితరాలకు అందించడం నా ముందున్న ఏకైక లక్ష్యం" అని చంద్రబాబు అన్నారు.

## అప్పుడు ఐటీతో అభివృద్ధి- ఇప్పుడు డేటాతో సంపద

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు టెక్నాలజీని అందిపుచ్చుకుని ఐటీని ప్రమోట్ చేశానని.. ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్, ఏఐవంటి రంగాలపై ఫోకస్ పెట్టానని సీఎం చంద్రబాబు వివరించారు. మారినకాలంలో డేటాతో సంపద సృష్టి అనేది కీలకమైందంటూ.. ఈ రంగాలపై ప్రభుత్వం ఎలాంటి విధానాలు అవలంభిస్తుందో చంద్రబాబు వివరించారు. "టెక్నాలజీ రివల్యూషన్‌ను అందిపుచ్చుకున్నాం. టెక్నాలజీ ద్వారా అభివృద్ధి సాధించవచ్చని నాడే భావించాం. మైక్రోసాఫ్ట్ వంటి ప్రముఖ కంపెనీలను తెచ్చాం. గతంలో ఐటీ కేంద్రంగా అభివృద్ధి ఆలోచనలు చేసేవాళ్లం. ఇప్పుడు క్వాంటం వ్యాలీ మీద ఫోకస్ పెడుతున్నాం. సమాచారమనేది అతి పెద్ద ఆస్తిగా మారుతున్న ఈ కాలంలో క్వాంటమ్ కంప్యూటింగ్ రాబోయే రోజుల్లో అత్యంత కీలకంగా మారనుంది. టెక్నాలజీ ద్వారా సామాన్యునికి కూడా సేవలు అందించడంతోపాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. టెక్నాలజీతో నేరాలను కట్టడి చేయవచ్చు. డ్రోన్లతో పోలీస్ పెట్రోలింగ్ చేయవచ్చు. ఎక్కువమందితో చేసే పనిని ఒక్క డ్రోనుతో చేయవచ్చు. మన ఆరోగ్యం ఎలా ఉందో కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి టెక్నాలజీని ఉపయోగించుకోవచ్చు. టెక్నాలజీ ద్వారా మన ఆరోగ్యాన్ని పర్యవేక్షించుకుంటూ ఉంటే.. ఆస్పత్రి ఖర్చులు తగ్గుతాయి. ఇవాల్టి రోజుల్లో ఆస్పత్రుల్లో చేరితే బోలెడంత ఖర్చవుతుంది. కొన్ని ఆస్పత్రులను ఫైవ్‌స్టార్ హోటళ్ల మాదిరిగా తీర్చిదిద్దుతున్నారు. ఆరోగ్యం బాగుంటే.. అసలు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితే రాదు. దీని కోసం టెక్నాలజీని వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజారోగ్యం విషయంలో బిల్ గేట్స్ ఫౌండేషనుతో కలిసి పని చేస్తున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు టెక్నాలజీని ఎలా వినియోగించుకోవాలనే అంశంపై కసరత్తు చేస్తున్నాం. ఈ విషయంలో ఏపీని మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. నవంబర్‌నాటికి పూర్తిస్థాయిలో ఆధార్ అథంటికేషన్ చేపడుతున్నాం. రాష్ట్రంలో అన్ని కుటుంబాల యూనిట్‌గా తీసుకుని జీయో ట్యాగింగ్ చేస్తున్నాం. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు సేవలందించడానికి ఈ జీయో ట్యాగింగ్ ఉపయోగపడుతుంది. డేటా లింక్ చేస్తున్నాం. దాదాపు 50 అంశాలకు సంబంధించిన విషయాల్లో డేటాను పూర్తిస్థాయిలో అందుబాటులోకి ఉంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఆమేరకు రియల్ టైంలో సేవలు.. నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. టెక్నాలజీని వినియోగించుకుని ఏడాది కాలంలో ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నాం. వాట్సాప్ గవర్నెన్సును అందుబాటులోకి తెచ్చాం. 503 సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 15నాటికి 703 సేవలను పూర్తిగా అందించేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## సమాజం నుంచి తీసుకున్నారు... తిరిగి సాయం చేయండి...

ఆర్థిక అసమానతలు తొలగించేందుకు పారిశ్రామికవేత్తలు.. ధనవంతులు ముందుకు రావాలంటూ ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. "మిలియన్, ట్రిలియన్ డాలర్ల ఆస్తిపరులు ఓవైపు... పూట గడవని పేదవాడు మరోవైపు అన్నట్టుగా ఉన్న అసమానతలు తొలిగేలా పని చేస్తున్నాం. సంపన్నులు సమాజానికి సేవ చేసే సమయమిది. సమాజంనుంచి ఎంతో తీసుకుని.. అభివృద్ధి చెందారు. ఇప్పుడు పేదలకు సేవ చేయాల్సిన సమయం వచ్చింది. సమాజంలో ఆర్థిక అసమానతలు పోయేలా చేయడమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఒకే సమాజంలో మిలియన్ డాలర్ల ఆస్తిపరులు.. పూటకు అన్నం దొరకని నిర్భాగ్యులున్నారు. ఈ అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వం వారధిలా వ్యవహరిస్తోంది. అసమానతలను రూపుమాపేందుకు ప్రభుత్వం పీ-4 విధానాన్ని ప్రమోట్ చేస్తోంది. దీనికి పారిశ్రామిక వేత్తలంతా సహకరించాలి" అని ముఖ్యమంత్రి పిలుపిచ్చారు.

## డిజిటల్ కరెన్సీ రావాలి..

పారిశ్రామికవేత్తల సదస్సులో ఎన్నికల్లో డబ్బు ప్రభావం మీద చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "డిజిటల్ కరెన్సీపై నేనే నివేదిక ఇచ్చాను. 500 నోట్లు రద్దు చేయాలని కోరుతున్నా. దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికల్లో డబ్బులు పంపిణీ ఎక్కువగా ఉంది. రాజకీయాలు కలుషితం అవుతున్నాయి.. దీంతో అన్ని వ్యవస్థలూ కలుషితం అవుతున్నాయి. కేవలం 100, 200 నోట్లే ఉండాలి. అప్పుడు ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గేందుకు అవకాశం ఉంటుంది. పెట్టుబడిదారులకు గత ప్రభుత్వ పాలన చేదు అనుభవం. ఆ ఐదేళ్ల గురించి ఆలోచన వద్దు. ఏపీకి నేను తీసుకొచ్చిన బ్రాండును గత ప్రభుత్వం ధ్వంసం చేసింది. వాళ్లు వస్తే.. మా పరిస్థితి ఏంటని కొంతమంది అడుగుతున్నారు. నాదీ హామీ... నేను ఈసారి ఏమరుపాటుగా లేను. ప్రభుత్వం కంటిన్యూ అయ్యేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కేంద్రంలో ఎన్డీఏ కంటిన్యూ అయింది కాబట్టే దేశం అభివృద్ధివైపు పరుగులు పెడుతోంది. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. గత ప్రభుత్వం మళ్లీ వస్తుందనే విషయం గురించి భయపడకుండా.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి" అని చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు భరోసానిచ్చారు.

## ఇదిగో చరిత్ర... అదుగో భవిష్యత్తు... విజన్‌తో విజయం

పారిశ్రామిక వేత్తల సదస్సులో చంద్రబాబు చరిత్రను గుర్తు చేసుకోవడంతో పాటు.. భవిష్యత్తు అంచనాలను వివరించారు. "రాజకీయ నేతలు... పారిశ్రామికవేత్తలను కలవకూడదనే అపోహ ఒకప్పుడుండేది. గతంలో పారిశ్రామిక సదస్సుల్లో కూడా ప్రభుత్వంవైపు నుంచి ఎవ్వరూ పాల్గొనే వారు కాదు. దావోస్ పెట్టుబడుల సదస్సుకు హాజరైన తొలి ముఖ్యమంత్రిని నేనే. నేను 9సార్లు దావోస్ సదస్సులకు హాజరయ్యాను. ఆర్థిక సంస్కరణలకు ముందు గ్రోత్ రేట్ కేవలం 2 శాతమే ఉండేది. ఆర్థిక సంస్కరణలు తెచ్చిన పీవీ నరసింహారావు తెలుగువాడేనని చెప్పడానికి నేను గర్విస్తున్నాను. గతంలో ఎవ్వరూ విజన్ డాక్యుమెంట్లు రూపొందించేవారు కాదు. నేను 2020 విజన్ డాక్యుమెంట్ రూపొందించాను. విజన్ 2020 నిజమైంది. ఇప్పుడు రూపొందించిన 2047 విజన్ కూడా కచ్చితంగా సక్సెస్ అవుతుంది. నేను నిర్మించిన సైబరాబాద్ సిటీని బిల్ క్లింటన్ ప్రారంభించారు. ఇప్పుడు అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నాం. ఇది భవిష్యత్ నగరం. అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో దేశం ఆర్థికంగా పరుగులు పెడుతోంది. 11 ఏళ్లుగా దేశంలో స్థిరమైన ప్రభుత్వం ఉంది. భవిష్యత్తు ఇండియాదే. గ్రోత్ రేట్ పెరుగుతోంది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా పని చేస్తున్నాం. 2.47 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరాలని ప్రణాళికలు సిద్ధం చేశాం. గ్రీన్ హైడ్రోజన్.. గ్రీన్ అమోనియాను ఎగుమతులు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రూ.1.45 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతోంది. బీపీసీఎల్ రూ.1 లక్ష కోట్లు, ఎల్జీ సంస్థ శ్రీసిటీలో రూ.5 వేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయి. ఒక్క గ్రీన్ ఎనర్జీ రంగంలోనే ఐదేళ్ల కాలంలో రూ.10 లక్షల కోట్ల మేర పెట్టుబడులు తెచ్చి.. 7.50 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ ఆలోచనలను సీఎం చంద్రబాబు సమగ్రంగా వివరించారు.

## పారిశ్రామికవేత్తలతో మాటామంతీ

ఫిక్కీ సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు కాసేపు ముఖాముఖి నెరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'వాజ్‌పేయి హయాంలోనే భారతదేశం ఒలంపిక్ క్రీడలను నిర్వహించాలనే ఆలోచన చేసింది. కానీ ఇప్పటి వరకు సాకారం కాలేదు. కాంగ్రెస్ హయాంలో జరిగిన కామన్వెల్త్ క్రీడలవల్ల చెడ్డ పేరు వచ్చింది. ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒలింపిక్ క్రీడలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు పెడుతోంది. చిన్నచిన్న దేశాలే ఒలంపిక్ క్రీడలను నిర్వహిస్తు న్నాయి. ఏపీలో క్రీడలకు సంబంధించిన మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నాం. యోగాంధ్రను అద్భుతంగా చేశాం. నేను చేపట్టిన సంస్కరణల వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందింది. భూములను ఎవ్వరూ అమ్ముకోవద్దు. భవిష్యత్తులో భారీగా ధరలు పెరగ బోతున్నాయని నాడు చెప్పాను. దీంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చాలామంది భూముల ద్వారా ధనవంతులయ్యారు. సూట్ కేసుల్లో కాకుండా.. గోనె సంచుల్లో డబ్బులు పెట్టుకునేవారు. ఇప్పుడు రంగారెడ్డి జిల్లా దేశంలోనే తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఒకటిగా ఉంది. ప్రతి కుటుంబంనుంచి ఓ పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది' అని చంద్రబాబు వివరించారు.

# ప్రజాస్వామ్యంలో.. నియంతలకు చోటులేదు!

- పాలన ఎలా ఉండకూడదో ఎమర్జెన్సీ ఒక కేస్ స్టడీ
- పాలకులు ఎలా ఉండకూడదో గత ఐదేళ్ల పాలనతో జగన్ ఓ కేస్ స్టడీ
- భారత ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ ఓ మాయని మచ్చ
- స్వేచ్ఛ, సమానత్వం, న్యాయమనే రాజ్యాంగ మూలాలు మరువొద్దు
- కూటమి ప్రభుత్వం ఏడాదిలో సుపరిపాలనలో తొలి అడుగు వేసింది
- సంవిధాన్ హత్య దివస్'లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన




విజయవాడ (చైతన్య రథం): భారత ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ ఓ మాయని మచ్చని, ప్రజాస్వామ్యంలో అహంకారం, నియంతృత్వ పోకడలు చెల్లవని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనే రాజ్యాంగ మూలాలను ఎవరూ విస్మరించకూడదన్నారు. భవిష్యత్ తరాలకు మంచి, చెడు చెప్పాల్సిన బాధ్యత ప్రజా జీవితంలో ఉన్న నేతలపై ఉందన్నారు. పాలన ఎలా ఉండకూడదో ఎమర్జెన్సీ ఒక కేస్ స్టడీ అయితే- పాలకులు ఎలా ఉండకూడదో గత ఐదేళ్ల పాలన ఒక కేస్ స్టడీ అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కూటమిగా మూడు పార్టీలు కలిసి ఏడాదిలో సుపరిపాలనలో తొలి అడుగు వేశామన్న ముఖ్యమంత్రి.. తనను అభిమానించే తెలుగు ప్రజానీకం కోసం అహర్నిశలు పాటు పడతానని స్పష్టంచేశారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'సంవిధాన్ హత్యా దివస్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరేళ్ల కిందట ఇదే రోజు ప్రజా వేదిక కూల్చారని.. ప్రజావేదిక కూల్చివేతకు ఆరేళ్లు సందర్భంగా ఈ సంవిధాన్ హత్యా దివస్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. "ప్రజావేదిక కూల్చివేతతో గత ప్రభుత్వం విధ్వంస పాలనకు తెరతీసింది. ఎమర్జెన్సీని మించిన నియంతృత్వ పాలన గత ఐదేళ్లూ చూశాం. ప్రజాస్వామ్యంలో నియంతలకు, విధ్వంసకారులకు చోటు లేదు. నియంతలకు చోటులేదని ఓటుహక్కు ద్వారా ప్రజలు చాటిచెప్పారు. కూల్చివేత నేతలను పంపించి.. పునర్నిర్మాణ బాధ్యతలు మాకు ఇచ్చారు. రాష్ట్ర పురోగతి కోసం కసి, పట్టుదలతో పనిచేస్తున్నాం" అన్నారు.

## దేశంలో అతిపెద్ద చీకటి రోజు

1975 జూన్ 25న ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తూ ఎమర్జెన్సీ విధించారు. దేశానికి అది చీకటి రోజు.భారత రాజ్యాంగం, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసిన రోజు. 21 నెలలు దేశమంతటా అత్యవసర పరిస్థితి విధించారు. ఇది తప్పని చెబితే చాలు తీసుకెళ్లి జైల్లో పెట్టారు. సామాన్యులను హింసించారు. నియంత్రృత ధోరణితో ముందుకెళ్లారు. న్యాయ వ్యవస్థలను కబళించారు. ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారు. 1975 జూన్ 12న ఎన్నిక చెల్లదని అలహాబాద్‌కోర్టు తీర్పునిచ్చింది.దీనిపై సుప్రీంకోర్టు ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కొనసాగించవచ్చని, ప్రజల వద్దకు వెళ్లి మరోసారి ప్రధాని కావచ్చని చెప్పినా నాటి పాలకులు వినలేదు. అహంభావం, నాకు తిరుగు లేదనే భావం రావడంతో ఎమర్జెన్సీ ప్రకటించారు. పత్రికలను మూసేశారు. జయప్రకాష్ నారాయణ, వాజ్‌పేయి, అద్వానీ, జార్జ్ ఫెర్నాండేజ్ వంటి వారితోపాటు మన రాష్ట్రానికిచెందిన ఎందరినో జైళ్లలో పెట్టారు. బలవంతంగా కుటుంబ నియంత్రణ చేశారు. 1984, ఆగస్టులో ఎన్టీఆర్ గుండె ఆపరేషన్ నిమిత్తం అమెరికా వెళ్లగా... మెజారిటీ ఎమ్మెల్యేలున్నా ఆయన ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారు. ఎన్టీఆర్ సహా ప్రజాస్వామ్యవాదులంతా నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడారు. 30వ రోజునే ఇందిరాగాంధీ మెడలువంచి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇది ప్రజాస్వామ్య విజయం అని చంద్రబాబు గుర్తుచేశారు.

## మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం

స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయింది. 8 దశాబ్దాల ఈ ప్రయాణంలో ఎన్నో మలుపులు, ఎన్నో సవాళ్లు ఎన్నో విజయాలను మన దేశం చూసింది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్న ఏకైక దేశం భారత దేశం.మంచీ చెడులు రెంటినీ కూడా మనం గుర్తుంచుకోవాలి. భావితరాలకు మంచిని అందించాల్సిన బాధ్యత ప్రజా జీవితంలో ఉన్న మాపై ఉంది. డాక్టర్ సమరం చెప్పినట్టు... ఎమర్జెన్సీ సమయంలో నిత్యం ప్రజలగురించి పనిచేసి గోరా చనిపోయారు. ప్రజలకు మంచి, చెడు ఏంటో తెలియజేయాలని ప్రధాని మోదీ, దేశమంతటా 'సంవిధాన్ హత్య దివస్' కార్యక్రమానికి నాంది పలికారని చంద్రబాబు అన్నారు.

## గత ఐదేళ్లూ రాష్ట్రంలో నియంతృత్వ పాలన


గడిచిన ఐదేళ్లూ పాలన ఎలా ఉందో అందరం చూశాం. నేనూ బాధితుణ్ణే. నేను 9ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నాను. కానీ ఇలాంటి పాలన ఎప్పుడూ చూడలేదు. అన్యాయం, అక్రమాలు, అవినీతితో చెలరేగిపోయారు. ఎవరు గొంతు విప్పినా నులిమేశారు. మోసాలు, దాడులు, కేసులు, రౌడీయిజం, ఆస్తులు రాయించుకోవడం ఒకటేంటి.. ఎన్నో అరాచకాలు చేశారు. కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి పిచ్చివాడిగా ముద్రవేసి చంపేశారు. మన అమ్మాయిని వేరే వారికి ఇవ్వాలన్నా, మన ఇంట్లోకి వేరే అమ్మాయిని తెచ్చుకోవాలన్నా ఐదారు తరాలు చూస్తారు. రాజకీయ నాయకులను ఎన్నుకునే సమయంలో మాత్రం అవేమీ పెద్దగా పట్టించుకోవటం లేదు. మీ చేతికి తుపాకీ ఇవ్వడం లేదు. మీరు యుద్ధం చేయాల్సిన పనిలేదు. మీకు ఓటు హక్కు ఇస్తున్నాను అని అంబేద్కర్ అన్నారు. 100 బిలియన్ డాలర్లు ఉండే వ్యక్తి అయినా, కూలి చేసే వ్యక్తికి అయినా ఒకటే ఓటు. ఓటు ఆయుధం. మంచి నాయకుడిని ఎన్నుకుంటే బాగుపడతాం అని చంద్రబాబు ఉద్బోధించారు.

## సుపరిపాలనలో తొలి అడుగు వేశాం

బీజేపీ, జనసేనతో కలిసి ముందుకెళ్తున్నాం. విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం వైపు నడిపిస్తామని చెప్పి ఒక్క ఏడాదిలో సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. మిత్రుడు పవన్ చాలా అవమానాలు ఎదుర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ముందుకొచ్చారు. నన్ను అభిమానించిన తెలుగు ప్రజల కోసం ప్రతి నిత్యం పనిచేస్తున్నాను. ఈతరం వారికి ఎమర్జెన్సీ గురించి పెద్దగా తెలీదు.మీరు కూడా చరిత్రను చదువుకోవాలి. మోదీ మనకు ప్రధానిగా ఉండటం మన అదృష్టం. ఆయన నాయకత్వంలో వికసిత్ భారత్‌ను, మన రాష్ట్రంలో స్వర్ణాంధ్ర సాధిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.












చైతన్యరథం

# పీ-4లో మార్గదర్శుల సంఖ్య పెంచాలి

- ఎన్ఆర్ఐల భాగస్వామ్యం పెంచేందుకు విదేశాల్లో పీ-4 సలహాదారుల నియామకం
- ఎంపికైన బంగారు కుటుంబాల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సర్వే
- మంచి ఫలితాలు చూపిన మార్గదర్శులకు గుర్తింపు, గౌరవం
- పీ-4పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం



అమరావతి (చైతన్య రథం): జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన పీ-4 విధానం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. మార్గదర్శుల గుర్తింపు, బంగారు కుటుంబాల ఎంపిక అంశాలపై సీఎం లోతైన సమీక్ష జరిపారు. పీ-4 విధానంలో మేలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19,15,771 బంగారు కుటుంబాలను గుర్తించగా.. వారిలో ఇప్పటివరకు 87,395 కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని అధికారులు వివరించారు. సమాజంలో చాలామంది ఏదోక రూపంలో పేదలకు సాయం చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని, అలాంటి వారికి పీ-4ను వేదికగా మార్చాలని సీఎం అన్నారు. మార్గదర్శకులుగా ఉండేవారిని సంప్రదించేందుకు... బంగారు కుటుంబాలను వారితో అనుసంధానించేందుకు మరింత ఎక్కువ దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిత్యం మానిటరింగ్ చేసేందుకు కాల్‌సెంటర్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. మార్గదర్శకులుగా ఉండాలనుకునే వారికి అసవరమైన సమాచారాన్ని, గైడెన్స్ ఇచ్చేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మార్గదర్శులతో బంగారు కుటుంబాలను అనుసంధానించిన తరవాత.... అంతకుముందు వారి పరిస్థితి, బంగారు కుటుంబంగా ఎంపికైన తరువాత వారి జీవన ప్రమాణాలను తెలుసుకునేందుకు సర్వేలను కూడా నిర్వహించాలని సీఎం సూచించారు. కార్యక్రమం అమలుపై విధిగా ఆడిటింగ్ నిర్వహించడం, మూడు నెలలకు ఒకసారి సమీక్షించడం, పీ-4 ప్రభావాన్ని నివేదకల ద్వారా ఎప్పటికప్పుడు మార్గదర్శకులకు కూడా అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

పారిశ్రామికవేత్తలు, ఎన్ఐఆర్‌లు, సెలబ్రిటీలు, ఉన్నత వర్గాలవారితో ప్రత్యేక కార్యక్రమాలు పీ-4 కాన్సెప్ట్‌ను వివరించి... వారిని మార్గదర్శులుగా ఉండేందుకు ఆహ్వానించాలని సూచించారు. కార్యక్రమంలో మార్గదర్శుల భాగస్వామ్యం పెంచేందుకు టాప్ 100 కంపెనీలకు చెందిన సీఈఓలు, సివోవోలు, సీఎఫ్ఓ, ఎండీలు, చైర్మన్‌లతో నేరుగా తానే మాట్లాడి పిలుపునిస్తానని సీఎం అన్నారు. దీంతోపాటు దేశ విదేశాల్లో ఉన్న తెలుగువారితో వర్చువల్ విధానంలో సమావేశమై కార్యక్రమ ప్రాధాన్యత, ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించి మార్గదర్శులుగా ముందుకొచ్చేందుకు వారిని ఆహ్వానిస్తానని అన్నారు. ఎన్ఆర్ఐలను పీ-4 అడ్వైజర్లుగా పెట్టి.... ఎన్ఆర్ఐలను మార్గదర్శకులుగా చేర్చేందుకు ప్రోత్సహించాలనే ఆలోచనతో ఉన్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు. జీరో పావర్టీ, పీ-4 కాన్సెప్ట్‌ను ప్రమోట్ చేసేందుకు రూపొందించిన పలు లోగోలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. త్వరలో ఒక లోగోను ఎంపిక చేయనున్నారు. అదేవిధంగా పీ-4ను ప్రారంభించిన మార్చి 30ని పి-4 వార్షికోత్సవంగా నిర్వహించి సాధించిన విజయాలను చాటి చెప్పాలన్నారు. అమరావతి క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్షకు మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులు హాజరయ్యారు.

## ఐటీ, సేవల రంగంలో భాగస్వాములవ్వండి




- నాస్కామ్ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు ఆహ్వానం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో నాస్కామ్ ప్రతినిధుల భేటీ
- రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వాములు అయ్యేందుకు ఆసక్తి

అమరావతి (చైతన్య రథం): ఐటీ, సేవల రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న విస్తృత అవకాశాలను వినియోగించుకునేలా... పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాస్కామ్ ప్రతినిధులను ఆహ్వానించారు. ఐటీ, సేవల రంగంలో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వాములు కావాలని బుధవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన నాస్కామ్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. బీఎఫ్ఎస్ఐ (బ్యాకింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్స్యూరెన్స్) రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు, నూతన సాంకేతికతను అందించేందుకు నాస్కామ్ ప్రతినిధులు ఆసక్తి చూపించారు. రాష్ట్రంలో ప్రజలకు సాంకేతిక ఆధారిత సేవలు అందించేలా కృషి చేస్తున్నామని... ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా డేటా లేక్ రూపొందించామని, దీని ఆధారంగా సేవలు విస్తృతం చేయాలని భావిస్తున్నట్టు నాస్కామ్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. గత తన పాలనలో ఐటీని ప్రమోట్ చేసినట్టే ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని సంకల్పించామని... అందరి స్కిల్ అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పెట్టుబడిదారులకు కావాల్సిన మానవ వనరులు రాష్ట్రంలో అందిస్తున్నామని చెప్పారు. మరోవైపు, చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా పురోగమిస్తోందని నాస్కామ్ ప్రతినిధులు ఈ సందర్భంగా కొనియాడారు.

## దేశానికే గర్వకారణం

**- శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రపై మంత్రి లోకేష్ అభినందనలు**




అమరావతి (చైతన్యరథం): దాదాపు 41 ఏళ్ల తర్వాత అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారత వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన శుభాంశు శుక్లాకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు బుధవారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరి వెళ్లారు. దీనిపై మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా శుభాంష్ శుక్లా, అతని బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ చారిత్రక ప్రయాణం భారత దేశానికి గర్వకారణం అని కొనియాడారు. ఈ మిషన్ కేవలం భారత అంతరిక్ష రంగంలో ఒక ముందడుగు మాత్రమే కాదు, ప్రపంచ అంతరిక్ష పరిశోధనల్లో పెరుగుతున్న భారతదేశ ప్రాధాన్యతకు చిహ్నంగా అభివర్ణించారు.

గ్రూప్ కెప్టెన్ శుభాంశ్ శుక్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నుంచి మొదటి ఇస్రో అంతరిక్ష యాత్రికుడిగా రికార్డు సృష్టించారు. ఇది చారిత్రాత్మక ప్రయాణంగా నిలిచిపోతుంది. శుభాంశ్ శుక్లా ప్రయత్నం భారత అంతరిక్ష రంగంపైనే కాదు... ప్రపంచ అంతరిక్ష యాత్రల్లో తనదైన ముద్ర వేస్తుంది. శుభాంశ్ శుక్లాకు అతని టీమ్‌కు అభినందనలు. ఈ యాత్ర అన్ని విధాలుగా విజయవంతం కావాలి. ఈ అంతరిక్ష ప్రయాణం ధైర్యం, ముందుచూపు, ఎదురులేని నూతన భారత ఆత్మకు నిదర్శనంగా నిలుస్తుందని లోకేష్ పోస్ట్ చేశారు. ఈ ట్వీట్‌ను ఇస్రో, నాసా, స్పేస్ ఎక్స్, యాక్సియం-4, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు ట్యాగ్ చేశారు. అలాగే శుభాంశ్ శుక్లా ప్రయాణించిన అంతరిక్ష వాహనంతో కూడిన ఫోటోను కూడా మంత్రి లోకేష్ ఎక్స్‌లో షేర్ చేశారు.

### కస్తూర్బా స్కూల్‌లో అగ్నిప్రమాదంపై
## మంత్రి లోకేష్ ఆందోళన

అమరావతి (చైతన్యరథం): విజయనగరం జిల్లా కొత్తవలస కస్తూర్బా స్కూల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంపై విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులనుంచి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంలో విద్యార్థులు నష్టపోయిన పుస్తకాలు, సామగ్రి తక్షణమే అందజేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని విద్యా సంస్థల్లో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు.

## ఎంతో గౌరవంగా భావిస్తున్నాను

**- డిప్యూటీ కలెక్టర్‌గా నియామకంపై సాకేత్ మైనేని సంతోషం**

**- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ధన్యవాదాలు**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం తనను డిప్యూటీ కలెక్టర్‌గా నియమించటం పట్ల ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్ కృతజ్ఞతలు తెలిపారు. దీనిని ఎంతో గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఇందుకు చొరవ తీసుకున్న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కు, త్వరితగతిన నిర్ణయం వెలువడేలా సాయపడిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి వర్గానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఏపీపీజీసెట్ ఫలితాలు విడుదల

**- విజేతలకు మంత్రి లోకేష్ శుభాకాంక్షలు**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(APPGCET) ఫలితాలు వెలువడ్డాయి. విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ఎక్స్ వేదికగా ఫలితాలు విడుదల చేశారు. 31 బ్రాంచ్ లలో మొత్తం 88.60% ఉత్తీర్ణత నమోదయిందన్నారు. ఈ పరీక్ష లకు మొత్తం 25,688 మంది నమోదు చేసుకోగా 19,488 మంది అర్హత సాధించారు. వీరిలో బాలురు 7463 (87.70%), బాలికలు 12025(89.17%)ఉన్నారు. ర్యాంక్ కార్డులను cets.apsche.ap.gov.in/PGCET/PGCET/PG ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంత్రి లోకేష్ తెలిపారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ర్యాంకు కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విజయం సాధించిన అభ్యర్థులందరికీ మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇకపై ప్రజలు, కార్యకర్తలతో మాట్లాడి..

# ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం















- కూటమి ప్రభుత్వ విజయాలను జులై 2నుంచి ఇంటింటికీ తీసుకెళ్లండి
- కూటమిలో మనది పెద్దన్న పాత్ర
- సమన్వయంతో ముందుకు సాగాలి
- ఓర్పు, సహనంతో ప్రజల్లోకి వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేయండి
- మచిలీపట్నం ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్

మచిలీపట్నం (చైతన్యరథం): ఇకపై పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, నేను ప్రతిరోజు ఐదుగురు ప్రజలు, ఐదుగురు కార్యకర్తలతో మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ అంతర్గత సమస్యలపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం.. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి.. పార్టీ కోసం కష్టపడిన ఏ ఒక్క కార్యకర్తను విస్మరించేది లేదు.. తప్పనిసరిగా వారి సేవలను గుర్తిస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో బుధవారం నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... గత ఎన్నికలకు ముందు బాబు సూపర్ - 6, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ, ఎన్నికల తర్వాత మన టీడీపీ, సభ్యత్వం కార్యక్రమాల్లో కార్యకర్తలంతా చురుగ్గా పాల్గొన్నారన్నారు. పార్టీ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి పనిచేసిన వారిని గుర్తించాలన్నదే మన పార్టీ విధానం. అధికారంలోకి వచ్చాక కేడర్‌ను మరువకుండా చంద్రబాబు, నేను ప్రతి జిల్లాకు వెళ్లినపుడల్లా కార్యకర్తలను కలుస్తున్నాం. పార్టీ అధినేత నుంచి కార్యకర్త వరకు అందరూ పార్టీ ఆదేశాలను పాటించాలి. తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబం. పార్టీ సంస్థాగత విషయాలు, సమస్యలపై చంద్రబాబుతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నా. 10 నిర్ణయాల్లో ఒక తప్పు జరగొచ్చు, తప్పులున్నపుడు వివిధ స్థాయిల్లో నాయకుల ద్వారా తమ దృష్టికి తెస్తే సరిదిద్దుకుంటాం అని లోకేష్ చెప్పారు.

### జులై 2నుంచి గడపగడపకు వెళ్లండి

జులై 2వతేదీ నుంచి ప్రతిఒక్కరూ గడపగడపకు వెళ్లి గత ఏడాది కాలంలో మనం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాబు సూపర్ - 6 కార్యక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఒక్క జీఓతో రూ.8,745వేల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. ఆర్థిక ఇబ్బందులున్నా నిర్ణీత సమయానికే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాం. పెద్దఎత్తున పరిశ్రమలను రప్పించడం ద్వారా అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు శాయశక్తులా కృషిచేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా వృద్ధులకు రూ.4వేల పెన్షన్ అందజేస్తున్నాం. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నామని లోకేష్ వెల్లడించారు.

### అహంకారం, ఇగోలను వీడండి

అహంకారం, ఇగోలను ప్రజలు హర్షించరు. గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే 151 కాస్త 11కి పడిపోయింది. ఎవరైనా నాయకులు తప్పుగా ప్రవర్తిస్తే ఆ ప్రభావం పార్టీపై పడుతుంది. ప్రజల్లోకి వెళ్లి ఓర్పు, సహనంతో వారు చెప్పే సమస్యలను వింటూ పరిష్కారానికి కృషిచేయాలి. గత ప్రభుత్వం కక్షసాధింపుతో నిలిపివేసిన ఉపాధి హామీ, నీరు - చెట్టు బిల్లులను 90శాతం వరకు క్లియర్ చేశాం. మిగిలినవి కూడా జులైలోగా అందజేసే ఏర్పాటు చేస్తాం. కార్యకర్తలపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, పెండింగ్ బిల్లులు వంటి సమస్యలుంటే మంగళగిరి కేంద్ర కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోండి. యువగళం పాదయాత్ర, శంఖారావం కార్యక్రమంలో మీ ప్రాంతానికి రాలేకపోయాను, ఆ తర్వాత నా అవసరం లేకుండా మీరు భారీ మెజారిటీతో పార్టీని గెలిపించారు. పాదయాత్రలో తెలుగుదేశంపార్టీ బలం, బలహీనతలను నేను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నా. చట్టపరిధిలో రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుంది, ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదని లోకేష్ స్పష్టం చేశారు.

### రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి దివాలా తీయించింది. ప్రధాని నరేంద్ర మోదీ మనకు అన్ని విధాలా సహకరిస్తూ ఆక్సిజన్ అందిస్తున్నారు. రాజధాని అమరావతి, విశాఖ ఉక్కు, విశాఖ రైల్వే జోన్ వంటి అన్ని కోర్కెలను ప్రధాని తీరుస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ఏర్పాటైంది, కూటమిలో మనది పెద్దన్న పాత్ర, సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలి. తెలుగుదేశం పార్టీ చొరవ వల్లే వక్ఫ్ బిల్లులో 4కీలక సవరణలు చేశారు. ముస్లిం మైనారిటీ పట్ల అది మనకున్న కమిట్‌మెంట్. పార్టీలో ఏ ఒక్క నాయకుడు మనం గతంలో పడిన ఇబ్బందులు, అవమానాలను మరువకూడదు. చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేసినపుడు... తాను ఆయనను కలిసేందుకు తీవ్రస్థాయిలో పోరాడాల్సి వచ్చిందని లోకేష్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఆరీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలను చదివించేందుకు..
# ఏ తల్లీ ఇబ్బంది పడకూడదనే!

మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో మహిళల గౌరవం పెరిగేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, పిల్లలను చదివించేందుకు ఏ తల్లీ ఇబ్బంది పడకూడదనే తల్లికి వందనం పథకం అమలుచేశామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు, కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు బుధవారం ఉదయం మచిలీపట్నం చేరుకున్న మంత్రి లోకేష్‌కు మూడు స్తంభాల సెంటర్‌లో మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో తల్లికి వందనం లబ్ధిదారులైన మహిళలు ఘనస్వాగతం పలికారు. తల్లికి వందనం పథకం అమలుచేసినందుకు మంత్రి నారా లోకేష్‌కు మహిళలు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు తెలుగు మహిళలు హారతితో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ ప్రసంగిస్తూ.. ఇక్కడికి వచ్చిన మీ అందరికీ రుణపడి ఉంటానన్నారు.

గత ప్రభుత్వ హయాంలో మహిళలను కించపరిచేలా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలను, తల్లులను గౌరవించాలని నిర్ణయించాం. సమాజంలో కూడా మార్పు రావాలి. మహిళలతో మాట్లాడే విధానం మారాలి. చట్టాలతో, డబ్బులతో ఆ మార్పు రాదు. గాజులు తొడుక్కో, ఆడపిల్లలా ఏడుస్తున్నావు వంటి వ్యాఖ్యలను మానుకోవాలి. పాఠశాలల్లో మహిళలను గౌరవించేలా విద్యార్థులకు పాఠ్యాంశాలు రూపొందించాం. అన్ని పనులు స్త్రీ, పురుషులిద్దరూ సమానంగా చేయాలని మంత్రి లోకేష్ ఉద్బోధించారు.

- తల్లికి వందనం అమలుపై మంత్రి లోకేష్
- మహిళల గౌరవం పెరిగేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది
- మా కుటుంబంలో మహిళల త్యాగాల వల్లే మేం ఈ స్థాయిలో ఉన్నాం
- మా అమ్మ త్యాగం వల్లే చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారు
- మచిలీపట్నంలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం పలికిన తల్లికి వందనం లబ్ధిదారులు
- పథకం అమలుచేసినందుకు ధన్యవాదాలు తెలిపిన మహిళలు



## మా అమ్మ త్యాగం వల్లే చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారు

నాకు, బ్రాహ్మణికి చిన్న వయసులోనే పెళ్లి చేశారు. మేం సమానంగా ఇంటిపనులు చేసేవాళ్లం. నేను పాదయాత్ర చేసి అహర్నిశలు ప్రజల కోసం కష్టపడుతున్నానంటే అందుకు బ్రాహ్మణి సహకారమే కారణం. బ్రాహ్మణి సహకారం లేకపోతే నేను ఏం చేయలేను. మా అమ్మ త్యాగం వల్లే చంద్రబాబు రాజకీయం చేస్తున్నారు. మా అమ్మ త్యాగం చేయక పోతే చంద్రబాబు రాష్ట్రానికి సేవ చేయలేరు. మహిళల త్యాగాలతోనే మేం ఈ స్థాయిలో ఉన్నాం. రెడ్ బుక్ పేరు వింటేనే కొందరికి గుండెపోటు వస్తోంది. మహిళలకు గౌరవం పెరిగేలా ఈ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంపీ బాలశౌరి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అడుగడుగునా స్వాగతం

పార్టీ కార్యక్రమాలు, కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రోడ్డుమార్గం ద్వారా మచిలీపట్నం బయలుదేరిన విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఘనస్వాగతం పలికారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఇతర టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మొవ్వ మండలం నిడుమోలు వద్ద మంత్రి లోకేష్ కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజానీకం ఘనస్వాగతం పలికారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్ వారితో ఫోటోలు దిగారు.













# అధికారంలో ఉన్నా కష్టపడాల్సిందే

- ప్రజలు మనపై పెద్ద బాధ్యత పెట్టారు
- ప్రజల్లోనే ఉండాలి, వారి సమస్యలు పరిష్కరించాలి
- పార్టీ నేతలు కష్టకాలాన్ని మర్చిపోకూడదు
- ఈ ఏడాది నిరుద్యోగ భృతి అందిస్తాం
- మచిలీపట్నం అంటే టీడీపీ, టీడీపీ అంటేనే మచిలీపట్నం
- కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని జులై 2 నుంచి ఇంటింటికీ తీసుకెళ్లాలి
- వైసీపీ నేతలకు ఇప్పటికీ అహంకారం తగ్గలేదు
- మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేష్

మచిలీపట్నం (చైతన్యరథం): ప్రజలు మనపై బాధ్యత పెట్టారని, కష్టపడి ప్రజాసమస్యలు పరిష్కరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నేతలతో బుధవారం మంత్రి నారా లోకేష్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మచిలీపట్నం అంటే తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం పార్టీ అంటేనే మచిలీపట్నం అన్నారు. మంత్రి కొల్లు రవీంద్రపై గత ప్రభుత్వంలో ఎన్ని అక్రమ కేసులు పెట్టి వేధించినా టీడీపీ కోసం, చంద్రబాబునాయుడు కోసం నిలబడ్డారు. మచిలీపట్నంలో అక్రమ కేసులతో ఎంత వేధించినా పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొని విజయాన్ని సాధించి పెట్టిన కార్యకర్తలకు నమస్కారాలు తెలుపుతున్నానన్నారు.

## పార్టీ నేతలు కష్టకాలాన్ని మర్చిపోకూడదు

నేను ఈ రోజు మచిలీపట్నం వస్తుంటే అడుగడుగునా పోలీసులు ఉన్నారు. మనపై అక్రమ కేసులు పెట్టిన వారే మనకు సెల్యూట్ కొట్టారంటే అదీ ప్రజాస్వామ్య గొప్పదనం. చంద్రబాబు మొండిధైర్యం మామూలుది కాదు. 1996లో రాజమండ్రి సెంట్రల్ జైలును ఆధునీకరించిన వ్యక్తి. 2014-19 మధ్య చంద్రబాబు కట్టిన బ్లాక్‌లోనే గత ప్రభుత్వ హయాంలో ఆయనను అక్రమంగా నిర్బంధించారు. జైలు నుంచి చంద్రబాబునాయుడు పులిలా బయటకు వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు అందరూ మనకు సెల్యూట్‌లు కొడతారు. పార్టీ నేతలు కష్టకాలాన్ని మర్చిపోకూడదు. పార్టీ కోసం ప్రాణ త్యాగం చేసిన తోట చంద్రయ్య, కంటిచూపు పోగొట్టుకున్న చెన్నుపాటి గాంధీ, గొడ్డలివేటుకు తీవ్రంగా గాయపడ్డ మంజులారెడ్డి, దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన అంజిరెడ్డి తాతలే మనకు ఆదర్శనం.

అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలా వ్యవహరించాలి. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకుందాం. ఏవైనా ఇబ్బందులు ఉంటే అంతర్గతంగానే పోరాడాలి. జగన్ రెడ్డిపై కంటే మూడు రెట్లు ఎక్కువగా పార్టీలోనే పోరాడా. పార్టీ ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ కట్టుబడి ఉండాలని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## ఈ ఏడాది నిరుద్యోగ భృతి అందిస్తాం

దేశంలో ఏ పార్టీకి రానివిధంగా 94శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది. ప్రజలకు మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చెప్పుకోవాలి. మెగా డీఎస్సీ ద్వారా 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. పెద్దఎత్తున కంపెనీలను తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది నిరుద్యోగ భృతి మొదలుపెడుతున్నాం. భూమి కన్నా ఎక్కువ భారం మోసేది మహిళ. వారిని గౌరవించాలనేది టీడీపీ నినాదం. మహిళలను గౌరవించటం అనేది ముందు మన ఇంట్లోనే మొదలవ్వాలి. 50శాతం పనులు మగవారు, 50శాతం పనులు ఆడవారు చేయాలని పాఠ్యాంశాల్లో పెట్టాం. జులై 5న మెగా పేరెంట్స్-టీచర్ మీటింగ్‌లో తల్లుల ఆశీర్వాదం తీసుకోవాలి. మహిళలకు ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. ఇప్పటి వరకు 2 కోట్ల సిలిండర్లు అందించాం. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సబ్సిడీ మొత్తాన్ని మహిళల అకౌంట్లలో జమచేస్తాం. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు, దివ్యాంగ పెన్షన్ రూ.6వేలు, పూర్తిగా అంగవైకల్యం ఉన్నవారికి రూ.15వేలు పెన్షన్ అందిస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లాలి

కూటమి ప్రభుత్వ అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్లాలి. జులై 2 నుంచి సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేయాలి. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇస్తాం.

ఇకపై నేతలందరూ నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించాలి. కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నేను అది చూసుకుని వెళ్లకుండా ముందుగా కార్యకర్తలతో సమావేశం అయ్యాను. ఇకపై నేతలందరూ నియోజకవర్గ పర్యటనల్లో కార్యకర్తలతో భేటీ కావాలి.

## వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు

వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ప్రతిపక్ష నేత ఇప్పటికీ ప్రజలను కలుసుకోవడం లేదు. కార్యకర్తలను కలవడం లేదు. రెడ్ బుక్ పేరు చెబితేనే ఒకరికి గుండెపోటు వచ్చింది, మరొకరికి బాత్‌రూమ్‌లో జారి చేయి విరిగింది. మేం చట్టప్రకారం ముందుకు వెళ్తున్నాం. పార్టీ నేతలు, కార్యకర్తలకు అహంకారం వద్దు. సౌమ్యంగా ఉండాలి. అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రజలు మనపై బాధ్యత పెట్టారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి. కష్టపడి ప్రజల సమస్యలను పరిష్కరించాలని మంత్రి లోకేష్ ఉద్బోధించారు.

## ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది

ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. కేంద్ర సహకారం వల్లే మనం ముందుకు వెళ్లగలుగుతున్నాం. ఏపీ కోరిన అన్ని కోరికలను ప్రధాని నరేంద్ర మోదీ తీరుస్తున్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో 3 లక్షల మంది యోగాసనాలతో గిన్నిస్ బుక్ రికార్డ్ సృష్టించి ప్రధాని మోదీకి కానుకగా ఇచ్చాం. కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయి. కూటమిని బలోపేతం చేద్దాం. ప్రభుత్వం, పార్టీ జోడెద్దుల బండి. రెండింటినీ నడిపేందుకు కష్టపడి పనిచేస్తున్నామన్నారు. మాటల్లో కాకుండా చేతల్లో కార్యకర్తలను గౌరవిస్తామని మంత్రి లోకేష్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జోనల్ ఇంఛార్జ్ మంతెన సత్యనారాయణ రాజు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, నియోజకవర్గ పరిశీలకులు ఎల్. సాయిరాం ప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.







చైతన్యరథం

## సమాజంలో అన్ని సమస్యలకు..

# విద్యతోనే పరిష్కారం!

- నైతిక విలువలతో జీవితంలో ఉన్నతస్థానాలకు ఎదగాలి
- ఉన్నత లక్ష్యాలతో దేశ సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ పిలుపు
- కృష్ణా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొన్న మంత్రి




మచిలీపట్నం (చైతన్యరథం): సమాజంలో అన్ని సమస్యలకు విద్య పరిష్కారం చూపుతుంది, ప్రపంచాన్ని మార్చగల సామర్థ్యం, సత్తా మీకు ఉన్నాయి, ఇక్కడి నుండే విద్యార్థులు కొత్త జీవితాన్ని ప్రారంభించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో బుధవారం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... కేవలం గ్రాడ్యుయేషన్‌తో నేర్చుకోవడం ఆగిపోకూడదు, అది జీవితాంతం కొనసాగాలని ఉద్బోధించారు. మీరు ఉపగ్రహాలను నిర్మించాలని, సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని, హరిత భవనాలను రూపొందించాలని, స్టార్టప్‌ను ప్రారంభించాలని, గ్రామీణ భారతదేశాన్ని శక్తివంతం చేయాలని కలలు కని ఉండొచ్చు. ఈ డిజిటల్ యుగంలో జ్ఞానానికి మించిన సంపద లేదు. మీరు మీ కెరీర్‌లో ఎదుగుతున్నప్పుడు ఎప్పుడూ విలువలను కోల్పోకండి. వాతావరణ మార్పు, ఆరోగ్య సంరక్షణ, సాంకేతిక నిపుణులుగా మాత్రమే కాకుండా దేశాభివృద్ధిలో పట్టుగొమ్మలుగా నిలవాలని కోరుతున్నా.

ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ గొప్పతనాన్ని ఈ సందర్భంగా మీకు తెలియజేయాలని భావిస్తున్నాను. న్యాయం, రాజ్యాంగ విలువలు, సమానత్వం, విద్య పట్ల ఆయనకున్న లోతైన నిబద్ధత మన రాష్ట్రాన్ని ఉన్నత శిఖరాలవైపు నడిపిస్తోంది. క్రమశిక్షణ, సంకల్పం ఈ ఆడిటోరియంలోని ప్రతి యువకుడికి ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుంది. ఇండియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (IIULER) స్థాపన వెనుక ఆయన మార్గనిర్దేశక శక్తిగా ఉన్నారు. ధైర్యం, వ్యక్తిత్వంతో అత్యున్నత స్థాయికి ఎదగగలరని చెప్పడానికి ఆయన జీవితం ఉదాహరణ అని మంత్రి లోకేష్ ప్రశంసించారు.

### వైఫల్యాలకు భయపడొద్దు

యువ గ్రాడ్యుయేట్లు పెద్ద కలలు కనాలి. కష్టపడి పనిచేయాలి. వైఫల్యానికి ఎప్పుడూ భయపడవద్దని కోరుతున్నాను. విజయం ఒక గమ్యస్థానం కాదు, అది స్థిరమైన వృద్ధి, లక్ష్యంతో కూడిన ప్రయాణం. కేవలం కెరీర్‌ను మాత్రమే కాకుండా – ఇతరులకు స్ఫూర్తినిచ్చే జీవితాన్ని నిర్మించుకోండి. మీ మూలాల గురించి గర్వపడండి. లక్ష్యంతో ముందుకు సాగండి. మీ భవిష్యత్తును మాత్రమే కాకుండా దేశభవిష్యత్తును రూపొందించే మార్గదర్శకులుగా నిలవండి. సమాజానికి మార్గం చూపే దివిటీలా మారి సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించాలని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

### పట్టభద్రుల జీవితాల్లో కొత్త అధ్యాయం

ఈ రోజు పట్టభద్రుల జీవితాల్లో కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. ఇప్పుడు డిగ్రీలు అందుకుంటున్న గ్రాడ్యుయేట్లందరికీ హృదయపూర్వక అభినందనలు. మీకు మాత్రమే కాదు, మీ తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఈ ప్రయాణంలో మీకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ వేడుక తీపిగుర్తు. మీ కృషి, పట్టుదల, నిబద్ధతకు ఇదొక కొలమానం లాంటిది. ఇది మీ జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది, ఇక రాబోయేది బాధ్యత, అవకాశాలతో నిండిన అధ్యాయం. మీ తల్లిదండ్రులు, కుటుంబం, రాష్ట్రం, దేశానికి మీ కృతజ్ఞతను చూపించాల్సిన ఉంది. మీ డిగ్రీ కేవలం ఒక సర్టిఫికేట్ మాత్రమే కాదు – అది ఒక బాధ్యత. మీ జ్ఞానాన్ని సమాజ హితం కోసం ఉపయోగించడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, నవీన ఆవిష్కరణలు చేయడం, విలువలకు కట్టుబడి ధైర్యంతో ముందుకు సాగడం మీ బాధ్యత. మీరంతా సమాజానికి దిక్సూచిగా నిలచే అధ్యాపకులుగా, పరిశోధకులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం స్ఫూర్తితో మీ కలలను సాకారం చేసుకుంటూ భారతదేశ సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఈ దేశాన్ని ముందుకు నడిపించే మార్గనిర్దేశకులుగా తయారు కావాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

### అధునాతన సాంకేతికలపై దృష్టిపెట్టండి

ఈరోజు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సమాజంలోని అన్నిరంగాల్లో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాతావరణ మార్పులను పసిగట్టడం, ఆరోగ్య సంరక్షణతోపాటు బయోటెక్నాలజీలో సరికొత్త ఆవిష్కరణల ద్వారా మానవ ఆయుర్దాయం పెంచే పరిశోధనలు జరుగుతున్నాయి. సాంప్రదాయ విలువలను గౌరవిస్తూ సృజనాత్మకతతో నైతిక నాయకత్వాన్ని పెంపొందించుకోవాలి. మీరు జీవిత లక్ష్యాన్ని ఎంచుకునేటప్పుడు కీ ప్లేయర్‌గా ఉండటం నేర్చుకోండి. మీరు ఎప్పుడూ యంత్రంలో ఒకభాగంలా కాకుండా వ్యవస్థలో ఒక ముఖ్యమైన లీవర్‌గా ఉండాలి. ప్రపంచానికి కార్మికులు మాత్రమే కాదు, సృష్టికర్తలు కూడా అవసరం. ఉత్తమ ఆవిష్కరణలు మీ అభిరుచుల నుంచే పుడతాయి. జీవితంలో స్థిరపడేందుకు మీ అభిరుచికి తగ్గట్లుగా ఏ మార్గాన్నయినా ఎంచుకోండి. లక్ష్యాన్ని చేరుకునేందుకు బాధ్యతతో ధైర్యంగా ముందుకు సాగాలని మంత్రి లోకేష్ అన్నారు.

### స్ఫూర్తిప్రదాతల పుట్టినిల్లు మచిలీపట్నం

దేశంలోనే ప్రసిద్ధి గాంచిన ట్రేడింగ్ పోర్టు టౌన్ మచిలీపట్నం. వాణిజ్యం, సంస్కృతి, కళలు, విద్యారంగంలో మార్గదర్శకులను, స్వాతంత్ర్య సమరయోధులను అందించిన నేల మచిలీపట్నం. ఇక్కడ ఉన్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యూరోపియన్లతో సహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి ఎందరో వ్యాపారులు ఇక్కడకు వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన తొలి మునిసిపాలిటీల్లో మచిలీపట్నం(1866) ఒకటి. ఇక్కడ స్థాపించిన నేషనల్ కాలేజ్ 1906 నాటి వందేమాతరం ఉద్యమానికి పుట్టినిల్లు. మచిలీపట్నం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమైంది. జాతీయజెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య, కృష్ణాపత్రిక సంపాదకలు ముట్నూరి కృష్ణారావు, అన్న నందమూరి తారకరామారావు ఈ జిల్లాకు చెందినవారే. కూచిపూడి నృత్య రూపం, కలంకారీ కళకుఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. దీనికి జీఐ ట్యాగ్ కూడా వచ్చింది. బందర్ లడ్డూ కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది. 1964 నాటి దివిసీమ ఉప్పెన పట్టణ జనాభాలో 50% మందిని (సుమారు 30,000 మందిని) పొట్టన పెట్టుకుంది. ఆ తర్వాత పలుమార్లు తీవ్ర తుఫానులు కూడా వచ్చాయి. అన్నిటినీ తట్టుకుని సమున్నతంగా నిలబడిందని మంత్రి లోకేష్ అన్నారు.

### ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ మెరుగుపర్చాలి

కృష్ణా విశ్వవిద్యాలయం 2008లో ఏర్పాటయింది. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయంలో 2000 మంది విద్య నభస్యసిస్తుండగా, 134 అనుబంధ కళాశాలలలో సుమారు 30,000 మంది విద్యార్థులకు సేవలు అందిస్తోంది. 2024-25లో కృష్ణా వర్సిటీ క్యాంపస్‌లో విద్యనభ్యసించిన విద్యార్థులు 100% ప్లేస్‌మెంట్ సాధించిన విషయం తెలుసుకుని ఎంతో ఆనందించాను. అయితే అనుబంధ కళాశాలలు గత విద్యా సంవత్సరంలో 50-60% ప్లేస్‌మెంట్ మాత్రమే సాధించాయి. 2017లో విశ్వవిద్యాలయం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 151-200 బ్యాండ్‌లో స్థానం సంపాదించినప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో ర్యాంకింగ్‌లో వెనుకబడింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ను 100 కంటే తక్కువకు తీసుకువచ్చేందుకు తక్షణం చర్యలు ప్రారంభించాలని వర్సిటీ పాలకమండలిని మంత్రి నారా లోకేష్ కోరారు.





చైతన్యరథం





## రోడ్డు మార్గాన మచిలీపట్నానికి...

# మంత్రి లోకేష్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం



మచిలీపట్నం (చైతన్యరథం): కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నం పర్యటనకు వెళ్లిన విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కు దారిపొడవునా టీడీపీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, సామాన్య ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఉదయం ఉండవల్లి నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరిన మంత్రి లోకేష్ మచిలీపట్నం చేరుకునే వరకు ఎక్కడికక్కడ అపూర్వ స్వాగతం లభించింది. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో పార్టీ నేతలు గజమాలలతో, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యకర్తలు, ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి పూలు చల్లుతూ అభిమానం చాటుకున్నారు. మచిలీపట్నం చేరుకున్న మంత్రి లోకేష్‌కు అక్కడ మంత్రి కొల్లు రవీంద్ర, ఇతర ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.






















# శభాష్ చంద్రబాబు, లోకేష్




- వారిని చూసి మిగతావారు నేర్చుకోవాలి
- విశాఖలో అద్భుతంగా యోగా డే నిర్వహణ
- కేంద్ర కేబినెట్ భేటీలో ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ: కేంద్ర కేబినెట్ భేటీలో ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల పనితీరును ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. గత 11 ఏళ్లుగా అనేక చోట్ల యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నా..కానీ, ఎక్కడారాని అనుభూతి యోగా డే రోజు విశాఖలో వచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏపీ ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన యోగాంధ్రపై ప్రధాని మాట్లాడారు. యోగా దినోత్సవాన్ని ఏపీ ప్రభుత్వం అద్భుతంగా నిర్వహించిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను మెచ్చుకున్నారు. చంద్రబాబు, లోకేష్‌ను చూసి మిగతావారు నేర్చుకోవాలన్నారు. యోగాంధ్ర నిర్వహణపై నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. నివేదిక వచ్చాక మిగతా రాష్ట్రాలకు పంపించి అధ్యయనం చేయాలని చెబుతామన్నారు. యోగాంధ్ర విజయాన్ని అందరూ కేస్ స్టడీగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖలో గిన్నిస్ రికార్డు స్థాయిలో జరిగింది. అద్భుతమైన ప్లానింగ్‌తో చిన్నపొరపాట్లు కూడా లేకుండా ఈ కార్యక్రమం జరగడం ప్రధాని మోదీని అబ్బురపరిచింది. అప్పుడే వేదిక మీదనే మంత్రి లోకేష్‌ను ప్రధాని ప్రశంసించారు. అయితే ఆ కార్యక్రమం నిర్వహణ మొత్తం ప్రధాని మోదీ మనసులో చెరగని ముద్ర వేసిందనే విషయం తాజాగా కేబినెట్ భేటీలో ఆయన ప్రశంసలతో స్పష్టమయింది.

మంత్రి నారా లోకేష్.. గిన్నిస్ రికార్డు టార్గెట్‌గా పెట్టుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయటంలో కీలక పాత్ర పోషించారు. మూడు లక్షల మందికి పైగా ఒకే సారి .. ఒకే చోట.. విశాఖ నుంచి భీమిలి వరకు యోగా చేశారు. ఇది గిన్నీస్ రికార్డు కూడా సాధించింది.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన

# అనలాగ్ ఆస్ట్రోనాట్ దంగేటి జాహ్నవి



- తెలుగు బిడ్డగా రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని అభినందించిన మంత్రి
- భవిష్యత్‌లో ప్రభుత్వ పరంగా అన్నివిధాల ప్రోత్సహిస్తామని హామీ

ఉండవల్లి (చైతన్యరథం): అమెరికా ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ చేపట్టిన టైటాన్ స్పేస్ మిషన్‌కు ఆస్ట్రోనాట్ క్యాండిడేట్‌గా ఎంపికైన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి బుధవారం సాయంత్రం శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్‌రెడ్డి సుబ్రహ్మణ్యంతో కలిసి ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. అంతరిక్షంలోకి అడుగుపెట్టబోతున్న భారతీయ తొలి తెలుగు మహిళగా జాహ్నవి ఘనత సాధించారు. 2029లో ఆమె తన మొదటి అంతరిక్ష యాత్రలో పాల్గొననుంది. స్పేస్ మిషన్‌కు వ్యోమగామి అభ్యర్థిగా ఎంపికైన జాహ్నవిని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ అభినందించారు. తెలుగుబిడ్డగా రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. ఈ క్రమంలో జాహ్నవి ప్రయాణాన్ని అడిగి తెలుసుకున్నారు. జాహ్నవి సాధించిన ఘనత మైలురాయిగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ లో ప్రభుత్వ పరంగా అన్నివిధాల ప్రోత్సాహం అందిస్తా మని హామీ ఇచ్చారు. విద్యాశాఖ చేపట్టే స్టెమ్ అవుట్ రీచ్ యాక్టివిటీలో ప్రభుత్వం తరపున భాగస్వామి కావాలని కోరారు.



# విద్వేషం, విధ్వంసమే వైసీపీ ఎజెండా

- జగన్‌రెడ్డి క్రూరత్వానికి ఆరేళ్లు
- ప్రచార పిచ్చితో ప్రాణాలు తీస్తున్నారు
- ఏ మొఖం పెట్టుకుని ఇళ్లకు వెళతారు
- రప్పా రప్పా కోస్తామని వెళతారా?
- కూటమి పాలనలో మీ ఆటలు సాగవు
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే వదిలిపెట్టం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- హెూంమంత్రి వంగలపూడి అనిత

మంగళగిరి(చైతన్యరథం): ప్రజా వేదిక కూల్చివేతతో 2019 జూన్ 25న జగన్ విధ్వంస పాలనకు శ్రీకారం చుట్టాడు..ఆ ఘటనతోనే జగన్ పతనం ప్రారంభం అయింది.. దాని ఫలితమే 11 సీట్లు..అయినా బుద్ధి రాకుండా విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తున్నాడు..కూటమి పాలనలో వారి ఆటలు సాగవు.. లా అండ్ ఆర్డర్ అతిక్రమిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెూం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. టీడీపీ కేంద్ర కార్యా లయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విధ్వంసమే ఎజెండాగా జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలన సాగింది. రూ.8 కోట్లతో కట్టిన ప్రజా వేదికను కలెక్టర్ కాన్ఫరెన్స్ పెట్టి కూల్చాడు. .ఇప్పటికీ ఆ శకలాలు అక్కడే ఉన్నాయి. అధికారం పోయినా కూడా హింసా వాతావరణాన్నే సృష్టించాలని జగన్‌రెడ్డి యత్నిస్తు న్నాడని ధ్వజమెత్తారు. అన్న క్యాంటీన్లు నిర్వీర్యం చేసి మూసేశాడు ..ఎక్కడా సిమెంట్ రోడ్లు వేసిన పరిస్థితి లేదు.. పోలవరాన్ని మూలన కూర్చోబెట్టాడు..అమరావతిని శ్మశానంతో పోల్చి మూడు ముక్క లాట ఆడాడు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే కేసులు పెట్టా రు. ప్రశ్నిస్తే రోడ్లపై కొట్టారు..ఎక్కువగా ప్రశ్నిస్తే హత్యలు చేశారు. నాడు అన్ని వ్యవస్థలను జగన్ రెడ్డి నిర్వీర్యం చేశాడు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశాడు. చీప్ లిక్కర్‌పై కూడా రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చిన ఘనుడు ఎవరైనా ఉన్నారంటే అది జగన్‌రెడ్డే. ఆడ వారిపై బూతులు తిట్టించాడు.. అసెంబ్లీ సాక్షిగా చంద్ర బాబు ను కన్నీళ్లు పెట్టుకునేలా చేశారు. నేడు సిగ్గులేకుండా వైసీపీ మూకలు బయటకు వచ్చి నీతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

### కూటమి పాలనలో ప్రశాంతంగా ప్రజలు

నాడు జగన్‌రెడ్డి బయటకు రావాలంటే పరదాలు ఉండాలి, చెట్లు నరకాలి, షాపులు మూసేయాలి.. మీటింగ్ పెట్టాలంటే టీడీపీ నేతలను హౌస్ అరెస్టులు చేయాలి. జగన్ రెడ్డి గురించి సోషల్ మీడియాలో గెట్టిగా ప్రశ్నిస్తే సీఐడీ కేసులు పెట్టి ఇరికించా రు. వయసుతో సంబంధం లేకుండా అరెస్టులు చేశారు. పోలీసు వ్యవస్థను చేతిలో పెట్టుకుని సామాన్య ప్రజలను అనేక రకాలుగా హింసించారు. ఈరోజు ప్రజలు ఆంక్షలు లేకుండా ప్రశాంతంగా బతుకుతున్నారు. ఎక్కడా పరదాలు లేవు,..చెట్లు నరకడం లేదు.. షాపులు మూసివేడయం లేదు.. హౌస్ అరెస్టులు లేవు. చనిపోయి ఏడాది అయిన వ్యక్తి కుటుంబానికి పరామర్శకు వెళతానన్నా కూడా జెడ్ ప్లస్ సెక్యూరిటీతో ఉన్న వ్యక్తికి ఎంత సెక్యూరిటీ కావా లో అంత సెక్యూరిటీని ఇచ్చాం. నాడు జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బిక్కుబిక్కుమంటూ జనం గడిపారు. లక్షలాదిగా ఉద్యోగస్తులు బయటకు వచ్చి ధర్నా చేస్తే వారిపై కూడా కేసులు పెట్టారు. విధ్వంసానికి, విద్వేషానికి జగన్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్. కూల్చివేతలు తప్ప కట్టడాలు చేతగాని పరిస్థితి. జగన్ జే



ట్యాక్స్‌కు భయపడి పరిశ్రమలు పారిపోయాయి. పరిశ్రమలు ఏపీలోకి రావాలంటే జగన్‌రెడ్డి కమీషన్, వాటాలకు భయపడి రాని పరిస్థితి. అటువంటి స్థితి నుంచి నేడు చంద్రబాబు పాలన చూసి కంపెనీలు ముందుకు వస్తున్నాయి. పెట్టుబడులు పెట్టడానికి సిద్ధపడటమే కాకుండా ఐదు లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించేందుకు సిద్ధం అవుతున్నాయని పేర్కొన్నారు.

### చంద్రబాబు విజన్‌తో అభివృద్ధి పథం

2047 విజనే కాకుండా.. ఐదేళ్ల విజన్ ప్లాన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో చంద్రబాబు ముందుకు తీసుకెళుతుంటే అది ఓర్చుకోలేక వైసీపీ మూకలు ఉద్ధండ పండితుల్లా మాట్లాడుతున్నా రు. జగన్ పాలనలో ఆగస్టు 15న రమ్య అనే అమ్మాయిని నడి రోడ్డుపై పొడిచి చంపితే ఒక్కరోజు కూడా బయటకు వచ్చి మాట్లా డలేదు. జగన్‌రెడ్డి పాలనలో ఎన్నో హత్యలు, అరాచకాలు జరిగినా ఒక్క మాట మాట్లాడలేదు. నేడు 11 సీట్లకు దిగజారిపోవడంతో ఎక్కడ ఎవరు చనిపోతారా.. శవ రాజకీయం చేద్దామా అని ఎదురు చూస్తూ హింసా రాజకీయాలను ప్రేరేపిస్తున్నాడు. రప్పా రప్పా కోస్తామంటూ విద్వేషాలను రెచ్చగొడుతున్నాడు. కూటమి పాలన లో వైసీపీ నేతల ఆటలు సాగవని హితవుపలికారు.

### అరాచక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

జనాలను రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేసినా.. ఆడబిడ్డలను అవ మానించేలా మాట్లాడినా ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టేది ఉండదని హెచ్చరించారు. తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారు. మేము నోటీసులు ఇచ్చినా పట్టించుకోకుండా అంబులెన్స్‌లకు కూడా దారి ఇవ్వకుండా బెట్టింగ్ పెట్టి చనిపోయిన వ్యక్తి కోసం పరామర్శ పేరుతో వెళ్లి ముగ్గురు ప్రాణాలు తీశాడు. తన కార్యకర్త తన కారు టైర్ కింద నలిగి చనిపోతున్నా పట్టించుకోలేదంటే అతని మనస్త త్వం ఏంటో రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలి. బాబాయి హత్య, కోడి కత్తి డ్రామా, గులకరాయి డ్రామా నుంచి మొదలుకుని.. మొన్న పోలీసులపై చెప్పులు విసరడం, మహిళలపై దాడులు చేయించడం అందరూ గమనిస్తున్నారు. మళ్లీ ఏ మొఖం పెట్టుకుని ఇంటింటికి వెళతారు.. రప్పా రప్పా కోస్తామని వెళతారా? జనాల వద్దకు వెళితే జనం మళ్లీ ముఖ్యమంత్రి చంద్రబాబే అని బల్లగుద్ది చెబుతారు. అమ్మకు వందనం ఇచ్చాం..మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం..డీఎస్సీ ఇవ్వబోతున్నాం.. రైతులకు ధాన్యం బకాయిలు ఇచ్చాం..త్వరలోనే మహిళలకు ఉచిత బస్ అమలు చేయబోతు న్నాం. రైతులకు ఖాతాల్లో నగదు వేయబోతున్నాం. కూటమి ప్రభు త్వం చేస్తున్న మేలును ప్రజలు గమనిస్తున్నారు.. ఎవరిది మంచి ప్రభుత్వమే ప్రజలే అర్థం చేసుకుని అరాచక శక్తులపై అప్రమ త్తంగా ఉండాలని సూచించారు.

# జగన్ భద్రతకు ఢోకా లేదు

- అతడి నుంచే ప్రజలకు భద్రత అవసరం
- మంత్రి నిమ్మల రామానాయుడు చురకలు



ఒంగోలు (చైతన్యరథం): జగన్ భద్రతకు ఏ విధమైన ఢోకా లేదని, జగన్ నుంచే ఈ రాష్ట్ర ప్రజలకు భద్రత అవసరమని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఒంగోలులోని ప్రకాశం జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో జగన్ అశాంతి, అలజడులను రేకెత్తిస్తున్నారని విమర్శించారు. పరామర్శల పేరిట ప్రజలకు ప్రాణహాని తలపెడుతున్నారన్నారు. వివిధ కారణాలతో మృతిచెందిన నేరగాళ్లకు శిలా విగ్రహాలు నెలకొల్పటం రాష్ట్ర చరిత్రలో కాదు దేశ చరిత్రలోనే జగన్మోహన్ రెడ్డికే చెల్లిందని దుయ్యబట్టారు. వారి కుటుంబాలకు పరామర్శ పేరుతో యాత్రలు చేపట్టి అమాయకుల ప్రాణాలు జగన్ బలితీసుకుంటున్నారన్నారు. తన కాన్వాయ్‌లో వాహనం కిందపడి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లకుండా అతని మృతికి జగన్ కారకుడయ్యాడని మంత్రి నిమ్మల తప్పుబట్టారు. జగన్ మనస్తత్వం మానవత్వానికి మచ్చగా పేర్కొన్నారు. ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి, గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ రెడ్డి తన నేర ప్రవృత్తితో రాజకీయాల్లో కొనసాగే నైతిక అర్హత కోల్పోయారన్నారు. సాటి మనిషి ప్రాణం పోతుంటే సామాన్యుడు సైతం స్పందిస్తాడు.. అలాంటిది మాజీ ముఖ్యమంత్రి అయివుండి కూడా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్లిపోయిన కర్కశ మనస్తత్వం కలవాడు జగన్ అని మంత్రి దుయ్యబట్టారు. నా దళితులు, నా ఎస్సీలు, నా బీసీలు అని చెప్పుకునే జగన్‌కు వారిపై ఉన్నది కపట ప్రేమగా ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. చనిపోయిన వాడు మా పార్టీ వాడు మీకెందుకని అనడం అతని దుర్మార్గానికి పరాకాష్ఠగా పేర్కొన్నారు. పరామర్శల పేరిట ప్రాణ నష్టం కలిగించటం, శాంతిభద్రతలు లోపించాయని ప్రభుత్వంపై ఎదురు నిందలు వేయడం జగన్ కుట్ర రాజకీయంగా విమర్శించారు. సంవత్సరం కిందట బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లి, మరో ఇద్దరిని బలిగొన్న రాక్షస మనస్తత్వం గల వ్యక్తి జగన్ అన్నారు. పరామర్శల పేరిట ప్రజలపై దండయాత్రలు చేయడం, ప్రాణహాని కలిగించడం అతని ఉన్మాద ప్రవృత్తికి నిదర్శనంగా చెప్పారు. డీజే సౌండ్ లు, నృత్యాలు, గజ మాలలు వేయించుకోవడం, ఘనంగా స్వాగతం పలికించుకోవడం ఇవన్నీ ఏ రకమైన పరామర్శలు అని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. జగన్ ఎక్కడికి వస్తే అక్కడ జనం చచ్చిపోతున్నారు. కాబట్టి అతని పరామర్శలు, పలకరింపులు వద్దు వద్దంటూ, అతని నుంచి మమ్మల్ని రక్షించండంటూ ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి చెప్పారు.

# క్రైస్తవ మైనారిటీల అభివృద్ధికి చర్యలు



- మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ హామీ
- పాస్టర్లకు గౌరవ వేతనం రూ. 30 కోట్లు చెల్లింపుపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఐక్య

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఇందులో భాగంగానే క్రైస్తవ మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం రూ. 30 కోట్లు ఒకేసారి విడుదల చేసి చెల్లించడం పట్ల ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (ఐక్య) ప్రతినిధుల బృందం మంత్రి ఫరూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని మూడవ బ్లాక్‌లోని మంత్రి కార్యాలయంలో మంగళవారం రాత్రి మంత్రి ఫరూక్‌ను ఐక్య బృందం సభ్యులు కలిశారు. ఐక్య ప్రతినిధులు డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందర బాబు, కే. హానోక్ బెంజిమెన్, జే. రవికాంత్, ఎం. ప్రేమ జ్యోతి బాబు, తదితరుల బృందం 10 వినతులతో కూడిన పత్రాన్ని మంత్రి ఫరూక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రైస్తవులు, చర్చిలు, పాస్టర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐక్య ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులపై జరిగిన పలు దాడులకు సంబంధించిన వివరాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. క్రైస్తవ మతాన్ని, ఏసుక్రీస్తును అవహేళన చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఐక్య సభ్యులు కోరారు. అలాగే దశాబ్దాల క్రితం క్రైస్తవ మిషనరీలు ఏర్పాటుచేసిన సమాధి తోటలు ప్రస్తుతం పూర్తిగా నిండిపోయాయని, గత రెండు దశాబ్దాలుగా ఈ సమస్య తీవ్ర రూపం దాల్చిందని, ఒకే సమాధిలో మూడు లేదా నాలుగు పార్థివ దేహాలను పూడ్చే పరిస్థితి నెలకొందన్నారు. క్రైస్తవులుగా చనిపోయిన వారిని, వారి పార్థివదేహాలను మట్టిలో పూడ్చడం మతాచారంగా ఉందన్న విషయానికి ప్రాధాన్యత ఇచ్చి సమాధి తోటలకు స్థలాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. పాస్టర్లుగా పనిచేస్తూ మత సంబంధ కోర్సులను పూర్తి చేసేందుకు ఆర్థిక సాయం, విద్యా వైద్య సంస్థలను నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గ్రాంటు మంజూరు చేయాలని కోరారు. క్రైస్తవులు (మాల,మాదిగలు ) బీసీ-సీలుగా ఉన్నందున ఉద్యోగ అవకాశాల్లో ఒక శాతం రిజర్వేషన్ మాత్రమే లభిస్తున్నదని, బీసీ-సీ కేటగిరీలో ఉన్నవారు, పాస్టర్లు, సువార్తికుల పిల్లలకు గ్రూప్ -1, గ్రూప్-2, గ్రూప్-3, ఆర్ ఆర్ బి తదితర ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఏడాదికి కనీసం 200 మందికి సదుపాయాలు ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. బాప్టిజం తీసుకోవడం, ఇవ్వడంపై ప్రభుత్వం ఆర్టికల్- 26 ప్రకారం కొన్ని మార్గదర్శకాలు ఇవ్వాల్సి ఉందని, సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఫరూక్‌కు ఐక్య బృందం విజ్ఞప్తి చేసింది. దీనిపై మంత్రి ఫరూక్ మాట్లాడుతూ తనకు అందజేసిన పది వినతులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మైనారిటీల అభివృద్ధి లక్ష్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఐక్య సమర్పించిన వినతులపై చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

# అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

- ప్రజా సమస్యల్ని వెలుగులోకి తెచ్చేది మీడియానే
- మీడియా సమాజ హితం కోసం పని చేయాలి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ఒంగోలు (చైతన్యరథం): జర్నలిస్టులకు మేలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం ఒంగోలులోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల్లో మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా మాట్లాడుతూ...సమాజాన్ని చైతన్య పరుస్తూ, నిజాన్ని నిర్భయంగా తెలిపే జర్నలిస్టులకు మేలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల కోసం మంత్రుల కమిటీని నియమించామని తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించే అంశం పునః పరిశీలనలో ఉందన్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మీడియా సంస్థల మధ్య పోటీతో, వ్యక్తుల మెప్పు కోసం తప్పుడు వార్తలు ప్రచారం చేయడం సమాజానికి హానికరమని, అలాంటి తప్పుడు ప్రచారం చేయొద్దన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చేది మీడియానేనన్నారు. ఎక్కడ సమస్య ఉన్నా జర్నలిస్టులు వారి రాతలతో ప్రపంచానికి తెలియజేసే వ్యక్తులని కొనియాడారు. మీడియా సమాజ హితం కోసం పనిచేయాలని, సమాజంలో ఉన్న అసమానతలు రూపుమాపడానికి, మూఢనమ్మకాలు, దురాచారాలను దూరం చేసే వార్తలు రాయాలన్నారు. నిజాన్ని నిర్భయంగా వార్తలుగా రాసే జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని మంత్రి స్వామి భరోసానిచ్చారు.



# జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి (చైతన్యరథం): పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ప్రత్యేకంగా "జలహారతి కార్పొరేషన్ లిమిటెడ్" అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు బుధవారం జారీ చేసింది. బనకచర్లతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఈ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయం కేంద్రంగా ఈ కార్పొరేషన్ పనిచేస్తుంది. ఈ సంస్థను 100 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి వరద నీటిని ఒడిసిపట్టుకుని రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడమే బనకచర్ల ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం.

# ప్రజాస్వామ్యానికి చీకటియుగం 'ఎమర్జెన్సీ'



◆ వైసీపీ దుర్మార్గ పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడిన సీఎం చంద్రబాబు

◆ "సంవిధాన్ హత్యా దివాస్" కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ (చైతన్యరథం): ప్రజాస్వామ్యానికి చీకటియుగంగా నిలిచిన 'ఎమర్జెన్సీ'కి 50 ఏళ్లు నిండాయని, ఎమర్జెన్సీని ఎదిరించి ప్రజాస్వామ్యం విజయం సాధించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ భాషాసాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన "సంవిధాన్ హత్యా దివాస్ 2025" కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించి 50 సంవత్సరాలు కావడంతో నాటి దుర్భర పరిస్థితులను వివరించారు. ఎమర్జెన్సీ కాలం భారత రాజ్యాంగ అమలుకు, రాజ్యాంగ స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగించిందన్నారు. నాడు ఎమర్జెన్సీని ఎదుర్కొని, నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో బలమైన ప్రజా ఉద్యమం ప్రారంభమైందని, ఈ సందర్భంగా ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు జనతాపార్టీ చేసిన కృషిని, పోరాటాన్ని, ప్రజాస్వామ్య చరిత్రలో కీలక మలుపుగా నిలిచిన 1977 ఎన్నికల్లో జనతాపార్టీ విజయాన్ని మంత్రి దుర్గేష్ కళ్లకు వివరించారు. ఈ సందర్భంగా నాటి జనతాపార్టీ విజయానికి, 2019-2024 మధ్యకాలంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై పోరాడి విజయం సాధించిన నేటి కూటమి ప్రభుత్వానికి ఉన్న సారూపత్యను స్పష్టంగా తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలన్న ఆలోచనతో, ప్రజాస్వామ్యంపై అచంచలమైన విశ్వాసం కలిగిన ప్రతి ఒక్కరూ జనతా పార్టీగా సమీకృతమై వీరోచిత ఉద్యమాలు చేసి విజయం సాధించి 1977లో కేంద్రంలో అధికారంలోకి వచ్చారన్నారు. అలాంటి అరాచక పరిస్థితులే ఏపీలో 2019-24 మధ్య కాలంలో చూశామన్నారు. ప్రతిపక్షనాయకుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబునాయుడిని 53 రోజులు జైల్లో పెట్టి గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఆ సందర్భంలోనే ప్రజాస్వామ్యాన్ని బ్రతికించుకోవాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు కూటమిగా ఏర్పడే చారిత్రాత్మక నిర్ణయానికి బీజం పడిందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి కూటమిగా ఏర్పడి అరాచక పాలనను అంతమొందించి ప్రజాస్వామ్యపాలనకు బాటలు వేశాయన్నారు.

## ప్రజాస్వామ్యానికి నిలువెత్తు రూపం సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాస్వామ్య విలువలపట్ల అచంచల విశ్వాసం గల నాయకుడుగా మంత్రి దుర్గేష్ కొనియాడారు. ప్రజాస్వామ్య విధానాలను అవలంబిస్తూ, ప్రజాస్వామ్య విధానానికి నిలువెత్తు నిదర్శనంగా సీఎం చంద్రబాబు నిలుస్తున్నారన్నారు. తాను సీఎం చంద్రబాబును గడిచిన సంవత్సరకాలంగా 26 కేబినెట్ సమావేశాలు, అనేక ఎస్ఐపీబీ సమావేశాల్లో దగ్గరగా చూశానని, ఆయన నాయకత్వ పటిమ ఏంటో అర్థమైందన్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజాస్వామ్యపాలను ఎలా చేయాలో తరుచూ దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రజాస్వామ్యం పట్ల చంద్రబాబునాయుడికి అమోఘమైన నిబద్ధత ఉందన్నారు. ఆయన రాజకీయ పరిణితి చాలా గొప్పదన్నారు. ఎవరైనా ఎంత రెచ్చగొట్టడానికి ప్రయత్నించినా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి హద్దు మీరి మాట్లాడని నేత చంద్రబాబునాయుడు అని మంత్రి దుర్గేష్ అన్నారు. నేటి యువత గతంలో జరిగిన తప్పులు తెలుసుకొని సమాజ మార్పు కోసం సుశిక్షితులైన సైనికులుగా పనిచేయాలని, ప్రజాస్వామ్య విలువలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు ఇచ్చారు.

# విద్యా దాత కంచర్ల రామయ్య



◆ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

◆ కుటుంబసభ్యులకు గొట్టిపాటితో పరామర్శ

కందుకూరు(చైతన్యరథం): కంచర్ల రామయ్య పత్రికా రంగంలో గుర్తింపు పొందారని, విద్యా దాతగా ఆయన సేవలు చిరస్మ రణీయమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల మరణించిన ప్రకాశం ఇంజనీ రింగ్ కళాశాల వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్ట్ కంచర్ల రామయ్య చిత్రపటానికి బుధవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరు ప్రకాశం ఇంజ నీరింగ్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు డోలాతో పాటు గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. అనంతరం కంచర్ల రామయ్య కుటుంబసభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా డోలా మాట్లాడుతూ కంచర్ల రామయ్య మృతి బాధాకరమన్నారు. రామయ్య కందుకూరులో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి నెల కొల్పి ప్రకాశం జిల్లా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అతి తక్కువ ఫీజులకే ఇంజనీరింగ్ విద్యను అందించారని అన్నారు. రామయ్య వివిధ రంగాల ద్వారా అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

# ఆశా వర్కర్లకు అదనపు ప్రోత్సాహకాలు



◆ దాతల సహకారంతో డెలివరీకి రూ.వెయ్యి

◆ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

◆ కొండపి పీహెచ్‌సీలో ఎక్సరే విభాగం ప్రారంభం

కొండపి(చైతన్యరథం): పేదలకు నాణ్యమైన వైద్యం అందిం చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస వాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం ప్రకాశం జిల్లా కొండపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స రే విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ఆశా వర్కర్లకు అదనపు ఇన్సెంటివ్‌లు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. వారికి ఇచ్చే జీతం రూ. 10 వేలతో పాటు దాతల సహకారంతో డెలి వరీకి రూ. 1000 చొప్పున అదనంగా ప్రోత్సాహకం అందజేస్తు న్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేం దుకు జిల్లాలో ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జ్‌లు కృషి చేస్తుండటం అభినందనీయమ న్నారు. దాతలు ముందుకురావాలని కోరారు. కొండపి పీహెచ్‌సీలో భవనాల ఆధునికీకరణకు రూ. 50 లక్షల ప్రభుత్వ నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఆసుపత్రి పరిసరా ల్లో సిమెంట్ రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు.

# అభివృద్ధి ప్రాజెక్ట్‌లు సకాలంలో పూర్తి

## వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌లకు ప్రధాని ఆదేశం



అమరావతి: ఆధార్ సంబంధిత ఫిర్యాదులు,ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్(పియం-అభియాన్), 5th స్ట్రీమ్ అల్యూమినియ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు తదితర ప్రగతి అంశాలపై బుధవారం ఢిల్లీ నుండి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేబినెట్ కార్యదర్శి డా.టివి సోమనాథన్‌తో కలిసి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ వివిధ ప్రగతి ప్రాజెక్టులు, పథకాలను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా రాష్ట్రాల సిఎస్‌లతో పలు ప్రాజెక్టులు, పథకాల ప్రగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబు, ఆర్అండ్‌బీ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, ఇఫ్ఎస్టి ప్రత్యేక కార్యదర్శి ఎస్.సర్వానందన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ.. రప్పా రప్పా పార్టీ

- ఎన్నికల గుర్తు గొడ్డలిగా పెట్టుకోండి
- సైకో నాయకుడు, ముఠాకు అవే కరెక్ట్
- సింగయ్యది జగన్‌రెడ్డి ప్రేరిపిత హత్యే
- జాతీయ ఎస్సీ కమిషన్ జోక్యం చేసుకోవాలి
- దళితుల ప్రాణాలు తీయడం వారికి అలవాటే
- లిక్కర్ స్కామ్ డైవర్ట్ చేసేందుకే డ్రామాలు
- ప్రాణాలు తీసే వ్యక్తికి ప్రాణభయమా?
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి ధ్వజం

నెల్లూరు(చైతన్యరథం): పోలీసు ఆంక్షలను ఉల్లంఘించి చేపట్టి న ర్యాలీలో సింగయ్య మెడను కారు కింద నలిపేశారు.. సాటి మానవుడి ప్రాణం పోతుందనే కనికరం కూడా లేకుండా శరీరాన్ని లాగి పక్కన పడేశారు.. దళితుల ప్రాణాలు తీయడం జగన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులకు అలవాటేనని పొలిట్‌బ్యూరో సభ్యులు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బెట్టింగ్ కట్టి ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరావు చావుకు జగన్‌రెడ్డే కార ణం. గంగమ్మ జాతరలో పోతును నరికినట్టు టీడీపీ కార్యకర్తలను రప్పా రప్పా నరికేస్తామనడం తప్పుకాదని సమర్థించుకోవడం సైకోకే చెల్లింది. వైసీపీ పేరు మార్చి రప్పా రప్పా పార్టీ అని పెట్టు కోవాలి.. ఎన్నికల గుర్తుగా గొడ్డలిని మార్చుకోవాలని హితవు పలి కారు. దళితుల ప్రాణాలు బలితీసుకోవడం వైసీపీ నాయకులకు మొదటి నుంచి అలవాటేనన్నారు. గతంలో డాక్టర్ సుధాకర్, డ్రైవ ర్ సుబ్రహ్మణ్యం, ఉదయగిరి నారాయణ, దుగ్గిరాల కరుణా కర్.. ఇప్పుడు సింగయ్యతో పాటు మరొకరు. ఆ దళిత కుటుంబా లను జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు ఎందుకు పరామర్శించలేదు. బెట్టిం గులో నష్టపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించే పేరుతో ర్యాలీ నిర్వహించి మూడు ప్రాణాలను బలితీసుకున్నాడు. సింగ య్య మృతి కేసులో జాతీయ ఎస్సీ కమిషన్ జోక్యం చేసుకోవాలని కోరా రు. రోప్ పార్టీ పోలీసులను పెట్టలేదని మాట్లాడటానికి జగన్ రెడ్డికి నోరెలా వచ్చింది? జగన్‌రెడ్డి భద్రత కోసం ఆ కార్యక్రమం లో ప్రభుత్వం 679 మంది పోలీసులను నియమించింది.

### మీ అరాచకాలు ప్రజలకు గుర్తున్నాయి

జెడ్ ప్లస్ కేటగిరి భద్రతలో ఉండే చంద్రబాబుపై పుంగనూ రులో రాళ్లు వేయించారు.. వందల మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు.. పవన్‌కళ్యాణ్‌ను అప్పట్లో నడి రోడ్డుపై కూర్చోపెట్టారు.. విశాఖలో జనసైనికులపైనా రాళ్లు వేయించాడు..యువగళం పాదయాత్రలో లోకేష్‌ను చిత్రహింసలు పెట్టారు.. సొంత పార్టీ ఎంపీలను సైతం వదిలిపెట్టకుండా కక్ష సాధింపులకు పాల్పడ్డాడు.. ఎంపీ రఘురామకృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ



ప్రయోగించి వీడియో కాల్‌లో చూసి పైశాచిక ఆనందం పొం దారు..ఒంగోలు ఎంపీ మాగుంటపై గ్రావెల్ దొంగతనం కేసు పెట్టించారు..ఇలా ఎన్నో దుర్మార్గాలు చేసిన వైసీపీ పార్టీ పేరుతో పాటు ఎన్నికల గుర్తు కూడా మార్చేయాలి.

### లిక్కర్ కుంభకోణం నుంచి తప్పించుకోలేరు

ఒక సీఎం కుటుంబం, ఆయన సన్నిహితులు అవినీతికి పాల్పడితే ఏ విధంగా చేయొచ్చ నేందుకు లిక్కర్ స్కామే నిదర్శనం. ఏపీ మద్యం స్కాముకు సంబంధించి అంశాలు పత్రికల్లో పుంఖా నుపుంకాలుగా వస్తున్నాయి. మద్యం స్కాములో జరిగిన అక్రమాల విలువ అధికారికంగా రూ.3200 కోట్లు అయితే..అనధికారిక విక్రయాలతో కలిపి స్కామ్ విలువ రూ.10 వేల కోట్లపైనే. లిక్కర్ స్కామ్‌లో నిజాలు చూస్తే సిట్ అధికారులకే మైండ్ బ్లాక్ అవు తోం దంట. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రూటింగ్, డిస్టలరీల స్వాధీనం, విదేశీ అకౌంట్లు, బంగారు నగలు, వజ్రాల లావాదేవీలు వెలుగులోకి వస్తున్నాయి. లిక్కర్ స్కామ్ డైవర్షన్ కోసమే రోజూ ప్రెస్ మీట్లు పెట్టి జగన్‌రెడ్డి హడావుడి చేస్తున్నాడు. పాలన సజావు గా నడవడం, అభివృద్ధి చెందడం జగన్ రెడ్డికి, సాక్షికి ఇష్టం లేదు. ప్రాణాలకు రక్షణ లేదని జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ప్రాణాలు తీసే ఆయన ప్రాణభయం అనడం విచిత్రంగా ఉంది. 679 మంది పోలీసులు భద్రతగా ఉంటే ప్రాణభయమెందుకో? కాకులు, కోతులు చనిపోయినప్పుడు వందల కొద్ది కాకులు, గుం పులుగా కోతులు వస్తాయి. వాటికున్న జాలి, దయ కూడా జగన్‌రె డ్డితో పాటు వైసీపీ నాయకులకు లేకుండా పోయాయి. ముగ్గురు ప్రాణాలు పోతే ప్రెస్‌మీట్లు పెట్టి జోకులేస్తున్నాడు.. సైకో మనస్త త్వం కలిగిన వారి లక్షణాలు అలాగే ఉంటాయని హితవుపలికారు.

---

# పెళ్లి పేరుతో మోసగించాడు

- రూ.6 కోట ఆస్తులు తీసుకున్నాడు
- అడిగితే చంపుతానని బెదిరింపులు
- ప్రజావినతుల్లో బాధితురాలి ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన మంతెన, కిమిడి

మంగళగిరి(చైతన్యరథం): శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్ ద్వారా తనకు పరిచయమై పెళ్లి పేరుతో మోసగించి రూ.6 కోట ఆస్తుల ను స్వాధీనం చేసుకుని చంపుతానని బెదిరిస్తున్నాడని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వేటుకూరు గ్రామానికి చెందిన వడ్లా నం రాధ ఆవేదన వ్యక్తం చేసింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రజా వినతుల కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదు చేసింది. అతనిపై చర్యలు తీసుకుని తన ఆస్తులను ఇప్పించాలని వేడుకుంది. మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరా జు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అర్జీలు స్వీకరించారు.

– తన పెద్దమ్మకు పిల్లలు లేకపోవడంతో ఆమె పేరుపై ఇంటిని తనకు రాసి ఇచ్చిందని గుంటూరు కొత్తపేటకు చెందిన సుకమంచి శ్రీదేవి తెలిపారు. ఆమె ఇటీవల మరణించడంతో అందులో అద్దెకు ఉంటున్న వ్యక్తులు ఇంటిని ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతు న్నారని ఫిర్యాదు చేసింది. తమపై దురుసుగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– అప్పికట్ల నాగేశ్వరరావు, ఆయన కొడుకు తమ ఇంట్లో దొం గతనం చేసి బంగారు నగలు తీసుకెళ్లారని కృష్ణా జిల్లా గూడూరు కు చెందిన నీలం కస్తూరి ఫిర్యాదు చేసింది. వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చింది.

– స్థల వివాదంపై అధికారులకు ఫిర్యాదు చేయగా వీఆర్వో, తహసీల్దారు ఎటువంటి చర్యలు తీసుకోకుండా.. లంచాలు తీసు కుంటూ తమకు అన్యాయం చేస్తున్నారని చిత్తూరు జిల్లా పూతల పట్టు మండలానికి చెందిన ఏ.సుభాషిని ఫిర్యాదు చేశారు.

– నల్లమోతు డేవిడ్‌సన్ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్ప డుతున్నాడని.. అతనిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా రెడ్డి గూడెం మండలం నాగులూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత ఫిర్యాదు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను కలవగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అర్జీని గ్రీవెన్స్ ద్వారా అధికారులకు పంపించారు.

– బతుకుదెరువు కోసం తాము వేరే ఊరికి వెళితే.. గవర్నమెం ట్ తమకు ఇచ్చిన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామానికి చెందిన కలవంటి సురేష్ తెలిపాడు. తమ ఇంటి స్థలాన్ని కబ్జా నుంచి విడిపించాలని కోరారు.

– టీడీపీ పార్టీకి ఓట్లు వేశామని తన పొలంలో ఉన్న తూము లను వైసీపీకి చెందిన ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మర్రెడ్డి అయ్యప్పరెడ్డిలు కావాలని ధ్వంసం చేశారని బాపట్ల జిల్లా చుందూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన మొవ్వా వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

---

# జగన్‌రెడ్డిది శవ రాజకీయం

- రౌడీలు, గంజాయి బ్యాచ్‌లకు పరామర్శ
- అలజడులు సృష్టిస్తే చట్టం చూస్తూ ఊరుకోదు
- కారు కిందపడితే వదిలేసి వెళ్లిన దుర్మార్గుడు
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజం



మంగళగిరి(చైతన్యరథం): శవాల మీద రాజకీయ పబ్బం గడు పుకునే ఆరాచక పార్టీ వైసీపీ అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ధ్వజమెత్తారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి పరామర్శలు, పర్యటనలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు..మానవత్వానికి అర్థం లేకుండా జీవిస్తున్న వ్యక్తి ఆయన.. తెనాలి, పొదిలి, సత్తెనపల్లి ప్రాంతాల్లో ఆయన ఎందుకు పర్యట నలు చేశారో వారికి వారే ప్రశ్నించుకోవాలి. కిరాయి రౌడీలను పరామర్శించేందుకు వచ్చాడు అని తెనాలి పర్యటనకు వచ్చిన తరు వాత అ ప్రాంత ప్రజలు అంటున్న మాట. పోలీసుల అనుమ తులకు విరుద్ధంగా కొన్ని వేల మందితో దౌర్జన్యంగా నిబంధనలు ఉల్లంఘించారు. రెంటపాళ్ల పర్యటన సందర్భంగా జగన్ కారు కింద పడి మనిషి చనిపోయాడు. ఎప్పుడో ఏడాది కిందట వైసీపీ కార్యకర్త బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని చనిపోతే పరామర్శకు వచ్చారు.. వెళ్లే దారిలో మీ కారు కింద మనిషి పడి చనిపోతే కనీ సం పట్టించుకోకుండా పక్కకు లాగేసి వెళ్లిన ఆయనకు మానవ త్వం గురించి మాట్లాడే అర్హత లేదు. విగ్రహావిష్కరణ చేసిన వ్యక్తి మాత్రమే వైసీపీ కార్యకర్త.. కారు ప్రమాదంలో మరణించిన వ్యక్తి వైసీపీ కార్యకర్త కాదనట్లు ప్రవర్తించారు. మీరు ప్రజానాయకుడు అయితే ప్రమాదానికి గురైన వ్యక్తిని అసుపత్రికి తరలించే పని చేయాలి. ప్రమాదం జరిగింది తమ వల్ల కాబట్టి ఆ కుటుంబాన్ని పరామర్శించి సాయం చేయాలి..కానీ అలా చేయలేదు. నాయకు డిని అని చెప్పుకునే దుర్మార్గుడు జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఉన్మాదిలా ఏ రకంగా ప్రవర్తిం చారో చూశాం..ఇప్పుడు పరామర్శల పేరుతో మీరు చేస్తున్న అకృ త్యాలు, అన్యాయాలు ఎవరు చేయలేరు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో సంక్షేమం – అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతుంది. జగన్ ఐదేళ్ల కాలం లో పోలవరాన్ని, అమరావతిని నాశనం చేశారు. పరిశ్రమలు రాకుండా పారద్రోలే విధంగా ప్రవర్తించారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి అతలాకుతలం చేశారు. జగన్‌రెడ్డి పాలనను చూసి 5 కోట్ల మంది అంధ్రులు అసహనానికి గురై 11 సీట్లకే పరిమితం చేశారు. దాని నుంచి గుణపాఠం నేర్చుకోకుండా నేడు రౌడీ మూక లు, గంజాయి బ్యాచ్‌లను పరామర్శించేందుకు తెనాలి వచ్చావంటే ఏమని అనుకోవాలో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. జేబు దొంగల సంఘానికి నాయకుడిగా జగన్‌రెడ్డి ఈ రోజు మిగిలిపో యారు. పొదిలిలో మహిళలపై చెప్పులు, రాళ్లతో దాడులు చేయిం చావ్... సాక్షి ఛానల్ డిబేట్‌లో అమరావతి మహిళలను కించపరి చే విధంగా వ్యాఖ్యలు చేస్తే కనీసం స్పందించలేదు.. ప్రజా సమా జానికి ఉపయోగపడేలా ఎన్నడూ ఆయన, సాక్షి మీడియా వ్యవహ రించలేదు. ఏదో రకంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారు. దానినే అనుసరిస్తూ ముందుకు పోవా లనుకుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుంది. సింగయ్య మరణానికి కారణమైన వారు ఏ స్థాయిలో ఉన్నా చట్టప్రకారం కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

## మహిళా సంక్షేమంపై దృష్టిసారించాలి : మంత్రి గుమ్మడి



నెల్లూరు(చైతన్యరథం): గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం నెల్లూరు జిల్లాలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల పనితీరు, బాలికల విద్య, పోషకాహార పంపి ణీ, గిరిజన హాస్టళ్ల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. మహిళా సాధికారత, బాల్య వివాహాల నివారణ, పిల్లల ఆరోగ్య భద్రత వంటి అంశాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవా లని సూచించారు. ప్రజలకు సంక్షేమ పథకాల పూర్తి ప్రయోజనం అందేలా నిరంతర పర్యవేక్షణ జరగాలని, సమస్యలపై తక్షణ స్పందన ఉండాలని ఆమె ఆదేశించారు. మహిళల భద్రత, బాలికల వసతిగృహాలు, పాఠశాలలు, సురక్షిత రవాణా వ్యవస్థలపై ప్రత్యే క దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పోషకాహార లోపాల నివారణకు మరింత ప్రభావవంతమైన చర్యలు తీసుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పథకాల మానిటరింగ్ మెరుగుపరచాలని సూచించారు. డిజిటల్ పద్ధతుల్లో డేటా నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో సహకార సంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు లేని గిరిజనులకు తక్షణ మే ఆధార్ కార్డులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా వారు అన్ని ప్రభుత్వ పథకాలు పొందగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం గ్రీవెన్స్ నిర్వహించారు. ఒక్కో ఫిర్యాదును శ్రద్ధగా విని పరిష్కారానికి నిర్ణీత గడువు నిర్ధారించారు.

## ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేయండి : బగ్గు రమణమూర్తి

నరసన్నపేట (చైతన్యరథం): పట్టణంలో అర్ధంతరంగా నిలిచిన ఇండోర్ స్టేడియానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కోరారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి మేడిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని వెలగపూడి సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బగ్గు మాట్లాడుతూ.. ఇండోర్ స్టేడియానికి గత టీడీపీ హయాంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించగా ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకక పోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో వల్లవానిపేట సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో ఏనుగుల గుంపు హల్‌చల్ - రైతుల్లో గుబులు



విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేస్తున్నాయి. వంగర మండలం కొత్త మరువాడ సమీపంలో ఈ గుంపును చూసిన గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ప్రతి ఏడాది ఏనుగుల గుంపు జూన్, జులై నెలలో వంగర మండలంలోకి ప్రవేశించి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సైతం మండలంలోని భాగం పేట, శ్రీహరిపురం, సంగం, వీటీఆర్ పేట, రాజులు గుమ్మడ, తలగం, మగ్గూరు, తదితర గ్రామాల్లో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయని రైతులు తెలిపారు. ప్రస్తుతం 9 ఏనుగులు సంచరిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగుల గుంపు చెరుకు, మొక్కజొన్న పంటలతోపాటు తోటలను సైతం నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను దారి మళ్లించి అడవి ప్రాంతానికి తరలించాలని రైతుల కోరుతున్నారు.

## అఖండ గోదావరి పర్యాటకం ప్రాజెక్ట్ పనులకు నేడు శంకుస్థాపన



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరికైన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్ సాకారం అవుతోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. 94 కోట్ల రూపాయలతో తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, కడియం, నిడదవోలు ప్రాంతాల్లో పర్యాటకం అభివృద్ధి చేయనున్నట్టు మంత్రి చెప్పారు. కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరి రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులతో కలిసి ఏర్పాట్లను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. అలాగే 127 ఏళ్ల చరిత్ర గల హ్యావ్ లాక్ రైల్వే వంతెన అభివృద్ధి, పుష్కర ఘాట్ సుందరీకరణ, కడియం నర్సరీలు, గోదావరి కాల్వలో బోటింగ్, బ్రిడ్జిలంక వద్ద టెంట్ హౌస్ తదితర పర్యాటక ప్రాజెక్టులు చేపట్టనున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తిచేస్తామని వెల్లడించారు. రేపు కేంద్ర మంత్రి షెకావత్ అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపనతో పాటు బొమ్మూరులో సైన్స్ మ్యూజియం నిర్మాణానికి ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. అలాగే అటవీ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు అటవీ అకాడమీకి శంకుస్థాపన చేస్తారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ వ్యతిరేకత దినోత్సవం సదస్సులో పాల్గొని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రసంగిస్తారని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అఖండ గోదావరి ప్రాజెక్టును సాధించి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. రాజమహేంద్రవరంలో పర్యాటక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదం చేస్తుందని ఆకాంక్షించారు.

**12 మందితో మంత్రివర్గ ఉపసంఘం :**

అయితే 2027లో జరిగే గోదావరి పుష్కరాలపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. 12 మంది మంత్రులతో ఏర్పాటు చేస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉప సంఘంలో సభ్యులుగా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, బీసీ జనార్దన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, పయ్యావుల కేశవ్ ఉన్నారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపసంఘం కార్యాచరణ రూపొందించనుంది. ఆయా శాఖల అధికారులు మంత్రివర్గ ఉప సంఘానికి సహకరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం

- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



శృంగవరపుకోట (చైతన్యరథం) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగిందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సందర్శించారు. కొత్తవలస మండలం అడ్డురివానిపాలెంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా హాస్టల్‌లో 280 పరుపులు అగ్నికి ఆహుతి అయ్యాయని ఎవరికి ఏ ప్రమాదం జరగలేదని విద్యార్థులందరు క్షేమంగా ఉన్నారని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి రాము, జీవన్ నాయుడు,మాజీ జెడ్పిటీసీ కోళ్ల శ్రీను, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రత్నాజీ, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, కోరుపోలు అప్పారావు,సర్పంచ్ అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ కోరుపోలు అప్పారావు, వార్డు మెంబర్ కర్రీ నూకరత్నం, గొంప దుర్గా ఉమేష్, సాగర్ కళ్యాణ్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలు ఇకపై ఏడాదికి రెండు సార్లు

- 2026- 27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న సీబీఎస్ఈ




అమరావతి (చైతన్యరథం): సీబీఎస్ఈ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదవ తరగతి పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ విధానం 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానుందని పేర్కొంది. మొదటిసారి నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుందని, రెండవసారి జరిగే పరీక్షలు ఆప్షనల్ అని తెలిపింది. రెండు సాధించిన మంచి స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటామని సీబీఎస్ఈ వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు. అయితే ఈ విధానం ద్వారా బోర్డుపై మరింత భారం పడనుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## సకాలంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

- వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహారానికి ఎంపీ కలిశెట్టి వినతి



విజయనగరం (చైతన్యరథం): రైల్వే శాఖకు సంబంధించి విజయనగరం పార్లమెంట్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం విశాఖపట్నంలో వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహారాని కలిసి సమస్యలపై చర్చించారు. చీపురుపల్లి ఆర్వోబీ (చీపురుపల్లి రాజాం రోడ్డు)ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, ఒడిశా ప్రయాణికులు ప్రయాణం సులభతరం అవుతుందని వివరించారు. విశాఖ నుంచి బొబ్బిలి, పార్వతీపురం మీదుగా ఒడిశాకు ప్రయాణించే వందేభారత్ రైలును బొబ్బిలి రైల్వే స్టేషన్ లో ఆపాలని విజ్ఞప్తి చేశారు. విజయనగరం రైల్వే స్టేషన్లో 20 సంవత్సరాల నుంచి హౌస్ కీపింగ్, క్లీనింగ్, ట్రాక్ మేంటెనెన్స్ తదితర విభాగాలలో పని చేస్తున్న సుమారు 50 మంది కార్మికుల సమస్యలను ఎంపీ వివరించారు. సాధ్యమైనంత వరకు పనులు చేపట్టాలని కోరారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి పేదరోగుల పాలిట వరంగా మారిందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని ఇరువురు రోగులకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధినుండి మంజూరు చేయించిన ఎల్‌ఓసిలను ఆయన అందజేశారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉంగుటూరుకు చెందిన అంబటి రంగారావుకు రూ.70 వేలు, గన్నవరం వాసి నాగసూరి లక్ష్మీ నాంచారయ్యకు రూ.2.75 లక్షల ఎల్‌ఓసిలను రోగుల కుటుంబ సభ్యులకు వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ పేద రోగులకు సత్వర, కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం సహాయనిధి ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ భేటీ



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో ఆంధ్రప్రదేశ్ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్‌గా వ్యవహరిస్తున్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కి విచ్చేసిన గారెత్ విన్ ఓవెన్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువతో సత్కరించి కొండపల్లి బొమ్మను బహుకరించారు. ఈ సందర్భంగా కొండపల్లి బొమ్మల ప్రత్యేకతను గారెత్ విన్ ఓవెన్‌కు వివరించారు. అనంతరం వీరిద్దరూ వర్తమాన సామాజిక రాజకీయ, విద్య,ఉపాధి వంటి అంశాలపై మాట్లాడుకోవటంతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల అంశంపై కూడా చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ రాజకీయ ఆర్థిక అంశాల సలహాదారు నళిని రఘురామన్, అకాడమిక్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఈవో అన్నే సుధీర్, డైరెక్టర్ అన్నే లక్ష్మీ తులసీ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

● రూ.27.62 లక్షల చెక్కులు అందజేత



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు పేదలు పలు ఆసుపత్రులలో వివిధ రకాల చికిత్సలు పొందిన వారికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి సిఫారసుతో 32 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.27,62,094 విలువైన చెక్కులను లబ్దిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఇంటి పెద్ద కొడుకుగా చరిత్రలో నిలిచిపోతారని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం, పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉదారంగా సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకుంటున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. తమను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవికి లబ్దిదారులు ధన్యవాదాలు తెలిపారు.

# లిక్కర్ స్కామ్ డబ్బు ఖజానాకు జమచేయాలి

● నాసిరకం మద్యంతో ప్రాణాలు తీశారు...

● ధాన్యం డబ్బులు ఎగ్గొట్టిన జగన్‌రెడ్డి... రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు

● మండిపడ్డ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి(చైతన్యరథం): మద్యం కుంభకోణంలో జగన్ దేశం దాటించిన వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ చేయాలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వర రావు కోరారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచావు.. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. సూపర్‌సిక్స్ హామీలను ముఖ్యమంత్రి చంద్రబా బు సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. జగన్‌రెడ్డి నేర ప్రవృత్తితో మానవత్వం మరిచి సింగయ్య మరణానికి కారణమయ్యారు. పశ్చాతాపం లేకుండా విషం చిమ్ముతున్నాడు. తిరుమలలో అవినీ తి, శ్రీవారి లడ్డును కల్తీ చేయడంతో వెంకటేశ్వర స్వామి 11 సీట్ల కు పరిమితం చేశాడు. మూడువేల కోట్ల బకాయిలు పెట్టిన జగన్ కు ఆరోగ్యశ్రీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు ఇవ్వలేని జగన్ నేడు రైతులు గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు. ప్రజలపై అడ్డగోలుగా విద్యుత్ భారం మోపి పీపీఎల్ రద్దుచేసి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టాడు. ఐదేళ్ల పాటు అమరావతిని విధ్వంసం చేసి మూడు రాజ ధానులతో రాజధాని లేని రాష్ట్రంగా మిగిల్చాడు. జగన్ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు గ్రాంటు కూడా ఇవ్వకపోవడంతో వేల కోట్ల నిధులు వెనక్కి వెళ్లాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన



బలిజిపేట (చైతన్యరథం): బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024- 2025 టెన్త్ బ్యాచ్లో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థులను పాఠశాల యాజమాన్యం బుధవారం సత్కరించింది. వెంగాపురం గ్రామానికి చెందిన గుగ్గిలాపు గాయత్రి 575 (ఇడుపులపాయ), ఉర్లాపు ప్రియాంక 565 (శ్రీకాకుళం)కు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. వీరిని ప్రధానోపాధ్యాయులు వంగపండు వెంకటనాయుడు, సహోపాధ్యాయులు అభినందించారు. వీరితో పాటుగా పి. శ్రీనివాసరావు, బీవీ రమణ, పైడపు నాయుడు, నారాయణస్వామి, గణేష్ రాజా గణేశ్, ఉషారాణి, ఇతర ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ప్రతీ కార్యకర్తను గౌరవిస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి.. కార్యకర్తలకు గౌరవం సాధ్యమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మచిలీపట్నం పర్యటనలో భాగంగా టీడీపీ కార్యకర్తలతో మంత్రి నారా లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. కష్టపడిన వారిని పిలిచి పదవులిచ్చే సంస్కృతి తెలుగుదేశం పార్టీలో మాత్రమే సాధ్యమన్నారు. పని చేసిన ప్రతీ ఒక్కరికీ గుర్తింపు ఇచ్చే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమే అని చెప్పుకొచ్చారు. టీడీపీ అధికారంలోకి రావడానికి కారణమైన ప్రతీ కార్యకర్తను గౌరవించుకుంటామన్నారు. మచ్చలేని వ్యక్తిని అరెస్టు చేస్తే.. లోకేష్ పడిన బాధ చెప్పలేనిదన్నారు. చంద్రబాబును అరెస్టు చేసినపుడు దేశం అంతా వ్యతిరేకించిందని చెప్పారు. న్యాయం గెలవాలి అంటూ భువనేశ్వరి చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. తనను హత్య కేసులో అరెస్టు చేస్తే అండగా నిలిచి తోడుగా నడిచిన కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదన్నారు. ఎప్పుడూ టీడీపీకి అండగా నిలిచిన కార్యకర్తలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యకర్తల కోసం ఇంత పెద్ద సభ నిర్వహించిన ఘనత టీడీపీలో మాత్రమే సాధ్యమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## తల్లికి వందనంతో మహిళల్లో ప్రభుత్వ ప్రతిష్ట పెరిగింది

●మీ పిల్లల చదువులకు ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు పడ్డాయా అని నాదెండ్ల మహిళల్ని ప్రశ్నించిన ప్రత్తిపాటి

●లోకేశ్ సమర్థవంతంగా పథకం అమలుచేసి ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచారు



చిలకలూరిపేట (చైతన్యరథం): తల్లికి వందనం పథకంపై మహిళల నుంచి అనూహ్యస్పందన వ్యక్తమవుతోందని... ప్రభుత్వంపై ఆడబిడ్డల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం నాదెండ్ల వెళ్లిన ప్రత్తిపాటి... తల్లికి వందనం పథకం తీరుతెన్నులపై స్థానిక మహిళలతో మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా, ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అందరికీ ప్రభుత్వం డబ్బులు వేసిందంటూ ప్రత్తిపాటి ఎదుట మహిళలు సంతోషం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వం బాగా ఇచ్చిందా... చంద్రబాబు బాగా చేశారా అని ప్రత్తిపాటి అడగ్గా... "జగన్ ఒక్కపిల్లాడికే ఇచ్చాడు...అదీ రెండేళ్లు ఇవ్వలేదు. చంద్రబాబు ఇప్పుడు అందరికీ ఇచ్చాడు" అని మహిళలు సంతోషంగా సమాధానమిచ్చారు. చంద్రబాబు బాగా పనిచేస్తున్నాడని.. ఆయన పడుతున్న కష్టం మేం కూడా చూస్తున్నామని ఆడబిడ్డలు అనడంతో.. బాగా గమనిస్తున్నారని ప్రత్తిపాటి వారిని మెచ్చుకున్నారు. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అందరికీ ప్రభుత్వం తల్లికి వందనం కింద సాయం చేయడం సామాన్యవిషయం కాదని ప్రత్తిపాటి తెలిపారు. పిల్లల చదువుల గురించి దిగులు పడకుండా తల్లులు ప్రత్యేకశ్రద్ధ పెట్టి వారిని ప్రయోజకుల్ని చేయాలని మహిళలకు సూచించిన ప్రత్తిపాటి.... మీ పిల్లల్ని బడికి పంపించకపోతే లోకేశ్ ఊరుకోడంటూ వారితో చమత్కరించారు. మహిళలతో ప్రత్తిపాటి మాట్లాడుతూ... మంత్రి లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలు చేపట్టి.. మంచి నిర్ణయాలు అమలుచేస్తున్నాడన్నారు. లోకేశ్ సమర్థత.. సరైన ఆలోచనావిధానంతో ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగిందని ప్రత్తిపాటి చెప్పారు. మహిళలు సంతోషంగా ఉండాలన్నదే చంద్రబాబు ఆలోచన అని.. ఇల్లాలి ఆనందం ఇంటికి వెలుగునిస్తుందని నమ్మే వ్యక్తి కాబట్టే డ్వాక్రా సంఘాలతో తెలుగు మహిళల్ని మహారాణుల్ని చేశాడని ప్రత్తిపాటి కొనియాడారు.

# గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలి

## పేదరికం నుంచి ఆ బిడ్డలకు విముక్తి కల్పించాలి: మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి పిలుపు

నెల్లూరు, (చైతన్యరథం): సమాజంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్న అమాయక గిరిజనులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి పేర్కొన్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో కూడా ఎక్కువ మంది గిరిజనులే ఉన్నారన్నారు. ప్రతి గిరిజన బిడ్డను స్కూలుకు పంపించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అక్కడ వారికి విద్యతో పాటు పోషకాహారం అందే సౌలభ్యం ఉందన్నారు. గతంలో మల్లికార్జునపురంలో గిరిజనుల దుస్థితిని పత్యక్షంగా చూసి వారిలో మార్పు తేవాలని గ్రామాన్ని దత్తత తీసుకున్నానన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు అదనంగా వేసి గిరిజనుల కోసం నాణ్యతతో కూడిన ఇళ్లు కట్టించామన్నారు. గత వైసీపీ పాలనలో గిరిజనుల కోసం కట్టిన ఇళ్లను కదిపితే కూలిపోయేలా ఉన్నాయన్నారు. గిరిజనులకు ఇంత అన్యాయం జరుగుతుంటే సచివాలయ ఉద్యోగులు, అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. కిటికీలు, తలుపులు ఇచ్చినట్టు రికార్డుల్లో వేలిముద్రలు వేయించుకున్నారన్నారు. అత్యంత నాసిరకంగా జరుగుతున్న నిర్మాణాలకు బిల్లులు చేయడానికి అధికారులకు మనస్సు ఎలా వచ్చిందని నిలదీశారు. సర్వేపల్లిలో ఎకరా రూ.35 లక్షలు విలువ చేసే 6 ఎకరాల గిరిజనుల పొలాన్ని రూ.35 లక్షల చొప్పున పెద్దరెడ్లు అమ్మేసుకున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు కనీస అవసరమైన ఆధార్ కార్డుకు కూడా నోచుకోకుండా వందల గిరిజన కుటుంబాలు ఉండటం బాధాకరమన్నారు. ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయతీలో గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేకపోవడం నేనే స్వయంగా చూసి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నానన్నారు. ముత్తుకూరు మండలంలో 680 మందికి, టీపీ గూడూరు మండలంలో 580 మందికి ఆధార్ కార్డులు లేకపోవడం గుర్తించామన్నారు. కలెక్టర్ సహకారంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి సర్వేపల్లి నియోజకవర్గంలో మొత్తం 2 వేల మందికి ఆధార్ కార్డులు చేయించామన్నారు. ఈ సమస్యను టీడీపీ పొలిట్ బ్యూరోతో పాటు అసెంబ్లీలోనూ ప్రస్తావించానన్నారు. గిరిజనుల విషయంలో ప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరాననన్నారు. ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు ఉన్నారుని, ఒక్కో ఉద్యోగి రోజుకు 10 ఇళ్లకు పెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకున్నా సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నాయన్నారు. సచివాలయం ఉద్యోగులు పలువురు సకాలంలో విధులకు హాజరుకావడం లేదన్నారు. వచ్చిన వారిలోనూ అందరికీ పని ఉండటం లేదన్నారు. గిరిజనులకు కనీసం ఆధార్ కార్డు కూడా లేకపోతే సచివాలయ ఉద్యోగులు ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. అప్పట్లో నెల్లూరుకు ఐటీడీఏ మంజూరు చేయించుకోవడానికి అనేక అవరోధాలు ఎదురయ్యాయన్నారు. మా జిల్లాలో చల్లా యానాదులు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఒప్పించి సాధించుకున్నామన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే కాదు..జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నానన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఆధార్ కార్డులు మంజూరు చేసే లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులకు ఆదేశాలివ్వాలన్నారు. ప్రభుత్వం తరఫున ఏ సంక్షేమ పథకం పొందాలన్నా ఆధార్ కార్డు కనీస అవసరంగా మారిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల నుంచి కలెక్టర్ వరకు గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి పేదరికం నుంచి బయటేయాలని కోరారు.





# నాలుగో నెంబరు జీవో వ్యాంగుల పాలిట వరం

## - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథంతో తీసుకున్న నిర్ణయం దివ్యాంగుల పట్ల వరమయిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు దివ్యాంగులకు సంబంధించిన పారా స్పోర్ట్ చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్హతలను బట్టి ఎలాంటి పోటీ పరీక్షలు లేకుండా దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు కల్పిస్తూ జీవో నెంబర్-4 విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మాల్యాద్రి నాయుడు , గుంటూరు జిల్లా సెక్రటరీ డాక్టర్ వై శ్రీనివాస్ గౌడ్, నెల్లూరు జిల్లా సెక్రటరీ కటారి యాదగిరి, ట్రైన్ ఇంచార్జ్ సురేష్, ఇంటర్నేషనల్ పారా క్రీడాకారిణి వి భవానీ, ఇంటర్నేషనల్ పారా స్విమ్మింగ్ క్రీడాకారుడు పోరెడ్డి చరిత్, వీల్ చైర్ నేషనల్ క్రికెటర్ పెంచలయ్య క్రీడాకారులు దివ్యాంగ సంఘ నాయకులు పాల్గొన్నారు.





ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 29 మంది లబ్ధిదారులకు 35,23,966 రూపాయల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పాల్గొన్న లబ్ధిదారులు, నాయకులు

# వారమంతా ఉచిత కంటి వైద్యశిబిరం

## నిర్వాహకులకు టీడీపీ నేత కోటంరెడ్డి కృతజ్ఞతలు

నెల్లూరు రూరల్, (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూర్ గ్రామంలో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి, శోభారెడ్డి సౌజన్యంతో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఉచిత కంటి శుక్లం శస్త్ర చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. సౌత్‌మోపూరులో ఏడు రోజుల పాటు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందిస్తున్న నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే అనేక ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు, ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డిని అభినందించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలందరూ సౌత్ మోపూర్ గ్రామంలో ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే ఉచిత కంటి శుక్లం శస్త్ర చికిత్స శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకొని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, నెల్లూరు రూరల్ మండలం ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, మండల కో ఆప్షన్ నెంబర్ మీరా మొహిద్దీన్, టిడిపి నాయకులు రాపూరు శేఖర్, చెన్నారెడ్డి సురేందర్ రెడ్డి, చెన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మనవరపు భాస్కర్, అన్నం సుధాకర్ గౌడ్, తుళ్లూరు రామయ్య,ఆరెద్దల మణి, టి. కామాక్షయ్య, సాదేపల్లి విజయభారత్ బి.గోపాలయ్య, అంకయ్య,గిరి, మస్తాన్, ప్రవీణ్, మనవరపు నరసయ్య, సునీల్, ఉబ్బల పెంచలయ్య, దబ్బుగుంట వెంకటేశ్వర్లు, రాపూరు కాలయ్య, ఉంటా శివయ్య, శివ,పెళ్లూరు గంగాధర్ ఉంటా శివరామ్, రాపూరు తిరుపాలు, అనూఫ్, తిరుపాలు, ఆలకుంట శీను, బొప్పరాజు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.





# దర్శి అభివృద్ధికి సహకరిస్తా

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి కలెక్టర్ తమీవమ్ అన్సారియా హామీ

దర్శి, (చైతన్యరథం): నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా భేటీ అయ్యారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి పనులపై కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సుదీర్ఘంగా చర్చించారు. దర్శి గవర్నమెంట్ స్కూల్లో ఫ్లోరింగ్, ప్రహరీ గోడ నిర్మాణం మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని డాక్టర్ లక్ష్మి కోరారు. తాళ్లూరు బాలికల హాస్టల్ వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన పనులు పూర్తి చేయాలని కోరారు. ఎస్సీ ఎస్టీ కాలనీలకు అనుసంధానంగా వెస్ట్ వీరాయపాలెం ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగింది. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలు, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలపై కలెక్టర్ గారితో డాక్టర్ లక్ష్మి చర్చించారు. వీటన్నింటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ లక్ష్మి వివరించారు.



# జాలి, దయ, మానవత్వం లేని కర్కోటకుడు జగన్

## ప్రజలు బహిష్కరించినా బుద్ధి రాని రాజకీయ ఉన్మాది : రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ ధ్వజం

అనంతపురం, (చైతన్యరథం): రాజకీయాలంటే ప్రజల కోసం పని చేస్తూ ఆదర్శంగా ఉండాలి. ప్రజలకు అండగా ఉండాలి. అలా కాకుండా జగన్ రెడ్డి వైసీపీ సైకో బ్యాచ్ మానవత్వం మరిచి, వైసీపీ కార్యకర్త ప్రాణాలు పోతున్నా.. కర్కశంగా ఎత్తి రోడ్డు ప్రక్కన పడేశారంటే ఇంత దౌర్భాగ్యం ఏమైనా ఉందా? అని వెంకటశివుడు యాదవ్ వైసీపీ నాయకులను నిలదీశారు. బుధవారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతో కలిసి పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఉన్న వారు బాధ్యతగా, జాగ్రత్తగా ఉండాలన్నారు. మనిషిగా ఏం మాట్లాడినా... చేసినా మనల్ని అభిమానించే వాళ్లు వాటిని అనుసరిస్తారనే స్పృహ ఉండాలన్నారు. దురదృష్టవశాత్తూ ముఖ్యమంత్రిగా పనిచేసి, ఒక పార్టీని నడుపుతున్న వైఎస్ జగన్ తీరు దారుణంగా ఉంటోందన్నారు. కనీస మానవత్వం లేకుండా, ప్రజల ప్రాణాలు కంటే తన రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడన్నారు. తన పైశాచిక ధోరణితో సొంత పార్టీ కార్యకర్తలను కూడా చంపేస్తున్నాడన్నారు. పొదిలిలో వైసీపీ కార్యకర్తల అరాచకం నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ జగన్ పల్నాడు పర్యటనకు కొన్ని సూచనలు చేస పరామర్శకు అనుమతి ఇచ్చిందన్నారు. అవసరమైన బందోబస్తు కూడా ఏర్పాటు చేశారన్నారు. అయితే ప్రతి అంశాన్ని, ప్రతి పర్యటనను రాజకీయంగా వాడుకునే జగన్ సొంత విన్యాసాలను, కుట్ర వ్యూహాలను అమలు చేస్తున్నాడన్నారు. జగన్ చేసిన షో కారణంగా ఇద్దరు వైసీపీ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల బెట్టింగ్‌లో ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్నవాడి విగ్రహం పెట్టడం, పరామర్శ పేరుతో పర్యటన చేసి మరో ఇద్దరిని బలితీసుకోవడాన్ని ఏమనాలని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల సూచనలను పట్టించుకోకుండా తన ప్రచారం కోసం తన పార్టీ కార్యకర్తల ప్రాణాలు తీశాడన్నారు. సింగయ్య కారు కింద పడినా పట్టించుకోలేదు.. స్వయంగా వాహనంపై ఉండి ఘటన తెలిసి కూడా జగన్ కారు దిగి స్పందించలేదు. ప్రమాదంలో కార్యకర్త చనిపోయాడని తెలిసి కనీసం మానవత్వం చూపలేదు. తన పర్యటనలో తన నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు చనిపోతే... కనీసం జగన్ సంతాపం తెలుపలేదు. పరామర్శ చేయలేదన్నారు. బెట్టింగ్, బ్లేడ్, బ్యాచ్‌ల పరామర్శకు యాత్రలు చేసిన జగన్... తన కారణంగా సొంత పార్టీ కార్యకర్తలు చనిపోతే కనీసం స్పందించలేదు. ఇదేనా మానవత్వం అని జగన్‌ను నిలదీశారు. పైగా కనికరం లేకుండా ముళ్ల పొదల్లోకి లాగిపడేసి నవ్వుకుంటూ జేజేలు కొట్టించుకుంటూ అక్కడి వెళ్ళిపోయాడన్నారు. నువ్వు అసలు మనిషివేనా జగన్ రెడ్డి? ఇలాంటి వాళ్లు రాజకీయాలకు అర్హులా అని ఎద్దేవా చేశారు. క్రూరత్వం తప్ప జగన్‌లో మానవత్వం లేదన్నారు. విద్వేషం, విధ్వంసమే అజెండాగా పనిచేస్తున్నాడనన్నారు. ప్రచార మోజులో కారుతో ఒక దళితుడి తలను తొక్కుకుంటూ నిర్దాక్షిణంగా జరిగిన ఘటనపై స్పందించని ఘోరమైన మనస్తత్వం ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని ఆక్షేపించారు. ఆ కారు డ్రైవర్ పోలీసు శాఖ ఉద్యోగి. అతని కళ్ల ముందు ప్రమాదం జరిగితే అతను కూడా స్పందించలేదన్నారన్నారు. అంటే జగన్ తన నేరాల్లో అధికారులు, సిబ్బందిని కూడా భాగస్వాములను చేశాడు. సాధారణంగా మనం రోడ్డు మీద వెళుతుంటే. మన కళ్ల ముందు ప్రమాదం జరిగితే... ఆగి వారికి సహాయం చేస్తాం. ఎక్కడ ప్రమాదం జరిగినా మానవత్వంతో స్పందించి బాధితులకు చేతనైన సాయం చేస్తాం. ఏ వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఉన్నాడంటే క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత. అందుకు విరుద్ధంగా జగన్మోహన్ రెడ్డి వ్యవహరించారని విమర్శించారు. కానీ ఇక్కడ జగన్ స్వయంగా తన కారు కింద పడిన వాడిని కూడా పట్టించుకోలేదు. ఇలాంటి వారిని ఏమనాలి... ప్రజలే కాదు ఆ పార్టీ కార్యకర్తలు కూడా జగన్ మనస్తత్వాన్ని గమనించాలి... ఆలోచించాలి... ప్రశ్నించాలి అని కోరారు. సకాలంలో వైద్యం అంది ఉంటే ఆ వృద్ధుడు బ్రతికేవాడన్నారు. ఇది జగన్ చేసిన హత్య కాక మరేమిటన్నారు. జగన్ కారు కింద సింగయ్యను ఈడ్చుకుంటూ వెళ్ళిన వీడియాలు దాన్ని సమర్థించుకోవడానికి వైసీపీ నాయకులు, సొంత మీడియా ద్వారా చేస్తున్న దిగజారుడు రాజకీయం నిజంగా అసహ్యం పుట్టిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీసీ చైర్మన్ కేశవరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నర్సనాయుడు గారుబీ రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి రామలింగారెడ్డిబీ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణబీ మీడియా కోఆర్డినేటర్ కూచే హరిబీ కురువ సాధికార కమిటీ సభ్యులు కురవ నారాయణస్వామిబీ తదితరులు పాల్గొన్నారు.




# వయోజన విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## గిరిజనులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు

కొడవలూరు, (చైతన్యరథం): గిరిజన సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కొడవలూరు మండలం రాజుపాళెం గ్రామంలో అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా మత్స్యకార సహకార సంఘాల సర్టిఫికేట్ల ప్రదానం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ మహిళలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించి వారి ఆధ్వర్యంలో గిరిజన మహిళా మత్స్యకార కో ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటు చేసిన ఏఆర్డీ సంస్థ నిర్వాహకులు బషీర్‌నుఅభినందించారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో స్థానిక సచివాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గిరిజనులకు విద్య యొక్క ప్రాముఖ్యత వివరించి వయోజన విద్యా కేంద్రాల ద్వారా వారిలో అక్షరాస్యత పెంచాలని సూచించారు. ఆధార్ కార్డు లేని గిరిజనుల కోసం ఇందుకూరుపేట మండలంలో తాను చేపట్టిన ప్రత్యేక ఆధార్ డ్రైవ్ సత్ ఫలితాలు ఇచ్చి ఒక్క రోజులోనే 500 మందికి ఆధార్ కార్డులు యిప్పించిన విషయాన్ని ఆమె పేర్కొన్నారు. అధికారులు చొరవ చూపి జిల్లా వ్యాప్తంగా గిరిజనులకు ఆధార్ కార్డు యిప్పించాలని కోరారు. గిరిజనులకు సంబంధించి వారికి వర్తించే చట్టాలపై వారికి సరైన అవగాహన కల్పించాలని స్థానిక ప్రజా ప్రతినిధులు పోలీసు, రెవెన్యూ అధికారులతో గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి వున్న యానాదుల జీవితాలలో మార్పు తెచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా మేనేజర్ బాబు, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ గుర్రప్ప, ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, %×ుణూ% ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లికార్జున, జిల్లా స్కిల్ డెవలెప్మెంట్ అధికారి ఎండి షరీఫ్‌తో పాటు కొడవలూరు టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# సింగయ్య మరణం ముమ్మాటికి జగన్ చేసిన హత్యే

## ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం

అనంతరం, (చైతన్యరథం): పల్నాడు జిల్లాలో జరిగిన సింగయ్య మరణం ముమ్మాటికి జగన్ చేసిన హత్యేనని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సింగయ్య మృతి విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యల మీద ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉనికి కోసం బల ప్రదర్శనలు చేస్తూ రాష్ట్రంలో సొంత పార్టీ కార్యకర్తలను కూడా జగన్ బలి తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అనుమతులు లేవని ముందే చెప్పినప్పటికీ వినకుండా ఏదో ఒక అలజడి సృష్టించాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అనుమతులు లేకుండా వేలమందితో ర్యాలీ చేశారని దాని ఫలితంగానే జగన్ వాహనం కింద సింగయ్య పడ్డారన్నారు. తాను చేసిన తప్పు ఒప్పుకోకుండా ప్రభుత్వంతో పాటు పోలీసుల మీద బురద జల్లుతున్నారన్నారు. 679 మంది పోలీసులను జగన్ పర్యటనలో బందోబస్తుకు పెట్టారన్నారు. బెట్టింగులు కట్టి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారంటే జగన్ ను ఏమనాలో తెలియడం లేదన్నారు. ఆయనకు ఎక్కడ శవం కనిపిస్తే అక్కడ వాలిపోతారని దాన్ని రాజకీయం చేసేందుకు ఎన్నో కుట్రలు పన్నుతారని దగ్గుపాటి విమర్శలు చేశారు. జగన్ హయాంలో దళితులు చనిపోతే కనీసం పట్టించుకోలేదని ఇప్పుడు సింగయ్య లాంటి దళిత సోదరుడు మరణిస్తే దానికి నైతిక బాధ్యత వహించకుండా బుకాయిస్తున్నాడన్నారు.




గతంలో పవన్ కళ్యాణ్, నారా లోకేష్ పర్యటనలను ఏ విధంగా అడ్డుకున్నారో ప్రజలంతా చూశారన్నారు. సింగయ్య మృతిని జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# సామాజిక మేలుకొలుపులో పాత్రికేయులదే కీలకపాత్ర


## - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఒంగోలు, (చైతన్యరథం): ఒంగోలులో త్రోవగుంటలోని విష్ణుప్రియ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ సమావేశంలో దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహ రెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్ విజయకుమార్, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామాచర్ల సత్య తదితర నాయకులు పాల్గొన్నారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల కోసం, సంక్షేమం కోసం ఏర్పడిన ఏపీయుడబ్ల్యూజే యూనియన్‌కు గొప్ప చరిత్ర ఉందన్నారు. 1957 ఆగస్టున ఏపీయుడబ్ల్యూజే యూనియన్ మానికొండ చలపతిరావు, మరో 35 మంది సభ్యులతో ప్రారంభించి నేడు వేలాది మందితో జర్నలిస్టుల హక్కుల సాధనకు అండగా నిలుస్తున్న బలమైన సంఘంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఏపీయుడబ్ల్యూజే కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ అనేక మంది పెద్దలు తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్, ముఖ్యంగా మాకు వెంట ఉండి వెన్నుదన్నుగా నిలుస్తున్న గౌరవనీయులు ఐవీ సుబ్బారావు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులుగా ఉండడం ప్రకాశం జిల్లాకే గర్వ కారణమన్నారు. 36వ రాష్ట్ర ఏపీయుడబ్ల్యూజే మహాసభలు ఒంగోలులో నేడు జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనేకమంది మేధావులు, ప్రముఖ జర్నలిస్టులు హాజరైన ఈ మహాసభకు నన్ను ఆహ్వానించడం నాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు సుబ్బారావు గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సమాజంలో జరుగుతున్న ప్రతి సంఘటన, ప్రతి మంచి కార్యక్రమాన్ని, చెడు కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే వారదులే జర్నలిస్టులన్నారు. నిరంతరం ప్రజాప్రతినిధులను, రాజకీయ నాయకులను అప్రమత్తం చేస్తూ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తూ సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల కృషి మరువలేనిదన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఏపీయూడబ్ల్యుతో పాటు కూటమి ప్రభుత్వంలో తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని జర్నలిస్టుల సంక్షేమానికి తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి ప్రదాత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర శ్రమ చూస్తున్నాం. స్వర్ణాంధ్ర సాధన కోసం వారు పడుతున్న తపన మనం మరువలేనిది. ఏడాది కూటమి ప్రభుత్వంలో స్వేచ్ఛగా ప్రజలు ముఖ్యంగా జర్నలిస్టులు తమ హక్కులను కాపాడుకోగలుగుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విలేకరులకు స్వేచ్ఛగా వార్తలు రాసే హక్కు కూడా లేకుండా నియంత్రించారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియా బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం సమాజాభివృద్ధిలో ఎంతైనా ఉందని, అది కాపాడడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఆమె వివరించారు.



# విశ్వ వినువీధిలో
# భారత కీర్తిపతాక రెపరెపలు

భారత అంతరిక్ష చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలయింది. విశ్వవినువీధిలో దేశ కీర్తిపతాక రెపరెపలాడే మధురఘట్టం ఆవిష్కృతమయింది. కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలు, శుభాశీస్సులను గుండెల నిండా నింపుకొని మన వ్యోమగామి శుభాంశు శక్లా రోదసీలోకి పయనమయ్యారు. ఆయనతో కలిసి మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని యాక్సియం-4 నింగిలోకి దూసుకెళ్లింది. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించింది. కొద్ది క్షణాల తర్వాత రాకెట్ నుంచి వీరి క్యాప్సుల్ విడిపోయి ఐఎస్ఎస్ దిశగా ప్రయాణం కొనసాగించింది. వాస్తవానికి ఈ ప్రయోగం మే 29న జరగాల్సి ఉన్నప్పటికీ పలు దఫాలుగా వాయిదాపడుతూ వస్తోంది. ఇప్పుడు కూడా ఈ ప్రయోగానికి కొన్ని నిమిషాల ముందు సమస్య తలెత్తగా.. శాస్త్రవేత్తలు దాన్ని సరిచేయడంతో అంతా సవ్యంగా జరిగింది.



**ఐఎస్ఎస్‌లో 'శుక్స్' గా..**

అమెరికాకు చెందిన అంతరిక్ష వాణిజ్య సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను చేపట్టింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)లు ఇందులో భాగస్వామ్యం వహించాయి. శుభాంశు శక్లాతో పాటు మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ (అమెరికా), స్పెషలిస్టులు టిబర్ కపు (హంగరీ), స్లావోస్ట్ ఉజ్నాన్స్ విస్నియెస్కీ (పోలండ్) రోదసిలోకి వెళ్లారు. ఈ ప్రయోగంలో శుభాంశు మిషన్ పైలట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతరిక్షంలో ఆయనను 'శుక్స్'గా పిలవనున్నారు.

వీరు 28 గంటల ప్రయాణం తర్వాత భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకున్నారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) వీరి వ్యోమనౌక ఐఎస్ఎస్‌క, అనుసంధానం అవుతుంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు బృందం 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో అక్కడి నుంచి ముచ్చటిస్తారు.

**ఇస్రో తరపున ఏడు ప్రయోగాలు..**

ఈ ప్రయాణం ద్వారా శుభాంశు గడించే అనుభవం.. 2027లో చేపట్టే స్వీయ మానవసహిత యాత్ర గగన్‌యాన్‌కు ఉపయోగపడుతుందని ఇస్రో చెబుతోంది. ఐఎస్ఎస్‌లో శుభాంశు ఇస్రో తరపున ఏడు ప్రయోగాలు నిర్వహిస్తారు. దీర్ఘకాల రోదసి యాత్రల సమయంలో పోషకాహారం, జీవనాధార వ్యవస్థల విషయంలో ముందడుగు వేయడానికి ఉద్దేశించిన ప్రయోగం కూడా ఇందులో ఉంది. భార రహిత స్థితి వల్ల ఎముకలు, కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థపై ప్రభావాన్ని శోధిస్తారు. నాసా నిర్వహించే ఐదు ఉమ్మడి అధ్యయనాల్లో శుభాంశు పాల్గొంటారు. మొత్తం మీద యాక్సియం-4 వ్యోమగాములు 31 దేశాలకు చెందిన 60 శాస్త్రీయ ప్రయోగాలను నిర్వహిస్తారు.. తద్వారా ఐఎస్ఎస్ ఒకే మిషన్లో అత్యధిక సంఖ్యలో ప్రయోగాలు చేపట్టినట్లవుతుంది.

**41 ఏళ్ల తర్వాత..**

ఈ ప్రయోగంతో 41 ఏళ్ల తర్వాత మన భారత వ్యోమగామి ఒకరు రోదసిలో.. భారరహిత స్థితిలో తేలియాడనున్నారు. అంతకుముందు 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్ కాస్మోస్ ప్రోగ్రామ్ కింద సోయుజ్ టి-11 వ్యోమనౌకలో రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు. ఆ తర్వాత భారత పౌరుడొకరు రోదసియానం చేయడం మళ్లీ ఇప్పుడే.

## నా భుజాలపై త్రివర్ణ పతాక... నా వెంట మీరంతా

కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలను మోసుకుంటూ భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా రోదసిలోకి వెళ్లారు. వీరి వ్యోమనౌక తాజాగా భూకక్ష్యలోకి ప్రవేశించి అక్కడ ప్రయాణిస్తోంది. ఈ క్రమంలోనే అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా భారత పౌరులను పలుకరించారు. ఇదో గొప్ప ప్రయాణం అని పేర్కొన్నారు. "నా ప్రియమైన దేశవాసులకు నమస్కారం. 41 ఏళ్ల తర్వాత మనం అంతరిక్షాన్ని చేరుకున్నాం. ఇదో గొప్ప ప్రయాణం. ఇప్పుడు మేం భూ కక్ష్యలో సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో తిరుగుతున్నాం. నా భుజాలపై మన త్రివర్ణ పతాకం ఉంది. అది చూస్తుంటే నాతో మీరంతా ఉన్నారనే భావన కలుగుతోంది. ఇది కేవలం నా అంతరిక్ష ప్రయాణం మాత్రమే కాదు.. భారత మానవ సహిత రోదసి యాత్రకు నాంది. ఈ ప్రయాణంలో మీరంతా భాగమవ్వాలని కోరుకుంటున్నా. మన దేశ మానవ సహిత అంతరిక్ష కార్యక్రమాన్ని మనమంతా కలిసి ప్రారంభిద్దాం. జై హింద్. జై భారత్" అని శుభాంశు శుక్లా తన సందేశంలో పేర్కొన్నారు. 'నా కోసం వేచి ఉండండి. నేను వస్తున్నా' అని శుభాంశు కుటుంబసభ్యులను ఉద్దేశించి పేర్కొన్నారు. ఇక, ప్రయాణానికి ముందు ఆయన తన తల్లిదండ్రులతో వీడియోకాల్లో మాట్లాడారు. శుభాంశు తల్లి చక్కెర, పెరుగు కలిపిన పదార్థాన్ని ఆయనకు వర్చువల్‌గా తినిపించారు. శుభాంశు రోదసియాత్రపై ఆమె మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 'ఇది మాకు ఎంతో గర్వంగా ఉంది. ఏమాత్రం భయపడటం లేదు. శుభాంశుని వెళ్లి మిషన్ పూర్తి చేయమని చెప్పాం' అని ఆమె పేర్కొన్నారు. ఇక, ఆయన సోదరి మాట్లాడుతూ.. ఈ కన్నీళ్లు ఆనందంతో వస్తున్నాయన్నారు. తాము సంతోషంగా, గర్వంగా ఉన్నామని తెలిపారు. ఇక, ఈ మిషన్ ప్రయోగాన్ని శుభాంశు కుటుంబసభ్యులు కూడా వీక్షించారు. ఆ సమయంలో వారంతా భావోద్వేగానికి గురయ్యారు.

అణ్వాయుధ సామర్థ్య


## ఎఫ్-35లను కొనుగోలు చేయనున్న బ్రిటన్..

అణ్వాయుధాలను ప్రయోగించే సామర్థ్యం ఉన్న ఎఫ్-35ఏ రకానికి చెందిన 12 విమానాలను కొనుగోలు చేయాలని బ్రిటన్ నిర్ణయించింది. ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత అణు రక్షణ విషయంలో బ్రిటన్ తీసుకొన్న పెద్ద నిర్ణయం ఇది. అమెరికాకు చెందిన కొన్ని అణ్వాయుధాలను బ్రిటన్లో భద్రపరిచే అవకాశం ఉంది. వీటిని తీసుకెళ్లడానికి ఈ విమానాలు ఉపయోగపడనున్నాయి. ఈ విమానాలు బ్రిటన్ దళాలను మరింత బలోపేతం చేయడంతోపాటు.. ప్రజలకు రక్షణగా ఉంటాయని. బ్రిటన్ ప్రధాని స్టార్మర్ అభిప్రాయపడ్డారు.

## పౌరస్వేచ్ఛకు పాతరేసిన ఇందిర పాలన

### ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా కేంద్ర మంత్రివర్గం తీర్మానం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర మంత్రివర్గం భేటీ అయ్యింది. 1975 నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర మంత్రివర్గం ఓ తీర్మానం చేసింది. 1975లో అత్యవసర పరిస్థితిని విధించడాన్ని ఖండిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మంత్రివర్గం ఆమోదించింది. మరోవైపు ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ అంశంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. పౌర స్వేచ్ఛలను అణచివేయడం, మీడియాపై సెన్సార్‌షిప్‌ను ప్రధాని మోదీ ఖండించారు. 'తాజాగా రిలీజైన ది ఎమర్జెన్సీ డైరీస్ పుస్తకం దేశంలో ఇందిరాగాంధీ విధించిన అత్యవసర





పరిస్థితులలో నా ప్రయాణాన్ని వివరిస్తుంది. ఈ పుస్తకం ఆ కాలంలోని అనేక జ్ఞాపకాలను తిరిగి తెచ్చిందని' మోదీ పోస్ట్ చేశారు. ఇంకా ప్రధాని తన సందేశంలో 'ఎమర్జెన్సీ చీకటి రోజులను గుర్తుంచుకునే వారందరూ లేదా ఆ సమయంలో బాధపడ్డ కుటుంబాల్లో ఉన్నవారంతా సోషల్ మీడియాలో తమ అనుభవాలను పంచుకోవాలని తాను కోరుతున్నానని, ఇది 1975 నుంచి 1977 వరకూ జరిగిన దారుణాలపై యువతలో అవగాహన పెంచుతుంది' అని ప్రధాని మోదీ చెప్పారు.

## సీబీఎస్ఈ టెన్త్‌కు
## ఏడాదికి రెండుసార్లు పరీక్షలు

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నుంచి సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలు ఏడాదిలో రెండుసార్లు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. మొదటి విడత పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయి. ఈ పరీక్షలకు విద్యార్థులంతా తప్పనిసరిగా హాజకావాల్సి ఉంటుంది. ఇక రెండో విడత పరీక్షలు మేలో ఉంటాయి. ఇది ఐచ్ఛికం. తమ ప్రతిభను పెంచుకోవాలని ఆశించే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రం అకడమిక్ సెషన్‌లో ఒకేసారి ఉంటుంది. సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోల్ సంయమ్ భరద్వాజ్ మాట్లాడుతూ.. పరీక్షల ఫస్ట్ ఫేజ్ ఫిబ్రవరిలోనూ, రెండో ఫేజ్ మేలోను ఉంటాయన్నారు. ఏప్రిల్, జూన్‌లో ఫలితాలు వెలువడతాయని తెలిపారు. ఫస్ట్ ఫేజ్‌కు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, రెండో ఫేజ్ వారివారి ఇష్టమని చెప్పుకొచ్చారు. విద్యార్థులు సైన్స్, మేథమెటిక్స్, సోషల్ సైన్స్, లాంగ్వేజ్‌లలో మూడు సబ్జెక్టులను ఎంచుకుని బెటర్‌మెంట్ కోసం



రాసుకోవచ్చని వెల్లడించారు.

**వింటర్ బౌండ్ స్కూళ్లలో..**

చలి ఎక్కువగా ఉండే (వింటర్ బౌండ్) స్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు ఏదో ఒక ఫేజ్‌లో పరీక్షలు రాసే అవకాశం కల్పించనున్నారు సీబీఎస్ఈ గత ఫిబ్రవరిలో ఈ పరీక్షలకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది.

# మళ్లీ శుద్ధి చేస్తే.. ఇంకా.. శుద్ధి చేస్తాం

## ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమంవైపు వెళ్లొద్దని ట్రంప్ హెచ్చరిక



ఇరాన్ యురేనియం శుద్ధి చేయడానికి దూరంగా ఉండాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. టెహ్రాన్ మరోసారి అణ్వాయుధ కార్యక్రమం జోలికి వెళితే మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇరాన్ మద్దతున్న సాయుధ ముఠాల ఆర్థిక మూలాలపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రత పెంచిన సమయంలో అమెరికా అధ్యక్షుడినుంచి ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. ఇక ఇజ్రాయెల్ వాయుసేన దక్షిణ లెబనాన్‌లోని అల్ సాదిక్ కరెన్సీ ఎక్స్ఛేంజి అధిపతి అబ్దుల్లా బక్రిని హతమార్చింది. ఇరాన్ ఖుద్స్ ఫోర్స్‌నుంచి వచ్చే డబ్బును ఈ సంస్థ హిజ్బుల్లాకు మళ్లిస్తుంది. మరోవైపు "యుద్ధం ఆగాలని ఇజ్రాయెల్, ఇరాన్ సమానంగా కోరుకున్నాయి. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలు, అణు సామర్థ్యాలను ధ్వంసం చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఆ తర్వాతే యుద్ధాన్ని ఆపా" అని ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

### పుతిన్‌కు అలా 'నో' చెప్పా..

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో కాల్పుల విరమణకు సాయం చేస్తానని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆఫర్ చేసినట్లు అమెరికా అధినేత ట్రంప్ వెల్లడించారు. అయితే.. తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్టు చెప్పారు. ఆయన నెదర్లాండ్లో ప్రారంభంకానున్న నాటో సదస్సుకు వెళుతున్న సందర్భంగా 'ఏయిర్ఫోర్స్ వన్'లో జర్నలిస్టులకు ఈ విషయాన్ని వివరించారు. "రష్యాతో ఓ ఒప్పందం కుదుర్చుకోవాలనుకొంటున్నాను. ఇటీవల పుతిన్ నాకు ఫోన్ చేసి 'ఇరాన్ యుద్ధంలో సాయం చేయమంటారా..? అని అడిగారు. ఇరాన్ విషయంలో నాకు సహాయం అవసరం లేదని చెప్పాను. మీ విషయంలోనే నాకు సాయం కావాలి" అని అన్నట్లు ట్రంప్ తెలిపారు. నాటో సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలిసే అవకాశాలున్నట్టు చెప్పారు. ప్రస్తుతం అతడు ఎన్నడూ లేనంత ఇబ్బందికర పరిస్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య సంధి కుదిర్చి మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలకనున్నట్టు వెల్లడించారు. గత వారం ఆ యుద్ధంలో ఆరు వేలమంది సైనికులు చనిపోయినట్లు ట్రంప్ పేర్కొన్నారు.




# ఐఏఈఏతో కలిసి పనిచేయం

## ఇరాన్ పార్లమెంట్ కీలక నిర్ణయం

ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన 24 గంటల్లోనే ఇరాన్ కీలక నిర్ణయం తీసుకొంది. ఇకమీదట అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)కు ఏమాత్రం సహకరించకూడదని నిర్ణయించింది. ఇరాన్ పార్లమెంట్ ఈ నిర్ణయానికి అనుకూలంగా ఓటు వేసింది. దీనికి ఆ దేశ సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. "ఇరాన్ అణు కేంద్రాలపై జరిగిన దాడులను ఖండించడానికి అంతర్జాతీయ అణు శక్తి సంస్థ నిరాకరించింది. దీంతో విశ్వసనీయతను వేలానికి పెట్టినట్లైంది" అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తమ అణు కేంద్రాల భద్రతకు గ్యారెంటీ ఇచ్చేదాకా ఐఏఈఏకు సహకారాన్ని నిలిపివేయాలని పార్లమెంట్ తీర్మానించింది. తాజాగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ జరగడాన్ని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ స్వాగతించింది. ఈ యుద్ధం జరిగినన్ని రోజులు ఐఏఈఏ ఇన్‌స్పెక్టర్లు ఇరాన్‌లోనే ఉన్నారు. ఈనెల 22 తెల్లవారుజామున అమెరికా బాంబర్ విమానాలు ఇరాన్‌లోని నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై భారీఎత్తున దాడి చేశాయి. ఈక్రమంలో అమెరికా బంకర్ బస్టర్లను ప్రయోగించింది. ఇవి ఆ కేంద్రాలను ఎంతవరకు దెబ్బ తీశాయనే విషయం మాత్రం తెలియరాలేదు. కొన్ని అమెరికా పత్రికలు మాత్రం ఫోర్డో కేంద్రం స్వల్పంగానే దెబ్బతిన్నట్లు చెబుతున్నాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందిస్తూ.. ఇరాన్‌పై దాడి చెప్పుకోదగిన స్థాయిలో నష్టం జరిగిందన్నారు. దీంతో ఆ దేశ అణు కార్యక్రమం చాలా వెనక్కి వెళ్లినట్టు తెలిపారు.

# భారత్‌తో అర్థవంతమైన చర్చలకు సిద్ధం: షెహబాజ్



ఉగ్రవాదాన్ని రూపుమాపే వరకు పాక్‌తో చర్చల ప్రసక్తే లేదని భారత్ స్పష్టం చేస్తున్నప్పటికీ.. దాయాది మాత్రం పాతపాటే పాడుతోంది. ఇరు దేశాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై అర్థవంతమైన చర్చలకు సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, ఉగ్రవాదం, వాణిజ్యం, జలాలు తదితర అంశాలపై చర్చలకు సిద్ధమన్నారు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఇటీవల ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా షరీఫ్ ఈ ప్రస్తావన తెచ్చినట్టు రేడియో పాకిస్థాన్ వెల్లడించింది. పశ్చిమాసియాలో తాజాగా నెలకొన్న పరిస్థితులపై సౌదీ యువరాజు ఎంబీఎస్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు టెలిఫోన్‌లో చర్చించినట్టు సమాచారం. ఈ సందర్భంగా భారత్-పాక్ మధ్య ఇటీవల నెలకొన్న ప్రతిష్టంభనను ప్రస్తావనకు తెచ్చిన షరీఫ్.. చర్చలకు సిద్ధమని చెప్పినట్టు తెలుస్తోంది. అయితే, పహల్గాం దాడి అనంతరం భారత్ సైనిక ఆపరేషన్ చేపట్టగా.. ప్రపంచ దేశాల మద్దతు కోసం పాక్ ప్రయత్నించింది. ఈక్రమంలో సౌదీ సహా ఇరాన్, అజర్‌బైజాన్‌లను వేడుకుంది. ఆ సమయంలో పాక్‌తో చర్చల ప్రస్తావనపై స్పందించిన భారత్.. సీమాంతర ఉగ్రవాదాన్ని రూపుమాపేవరకు వారితో చర్చల ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఉగ్రవాదం-చర్చలు ఒకేసారి జరగవని, నీరు-రక్తం కలిసి ప్రవహించలేవనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని ఉద్ఘాటించింది. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతోపాటు ఆ దేశంతో ఉన్న అన్ని వాణిజ్య సంబంధాలను తెగదెంపులు చేసుకుంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌తోపాటు పీవోకేలో ఉగ్ర స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. నాలుగురోజులపాటు కొనసాగిన ఈ దాడుల అనంతరం దాయాది వేడుకోలుతో కాల్పుల విరమణకు భారత్ అంగీకరించింది.

# రహస్యంగా న్యూక్లియర్ బాలిస్టిక్

## మిస్సైళ్ల తయారీ చేపట్టిన పాక్

పాకిస్థాన్ రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నట్టు వాషింగ్టన్‌లోని నిఘాసంస్థలు పేర్కొన్నాయి. వీటికి 5,500 కి.మీ.కంటే ఎక్కువదూరం ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యం ఉంటుందని సమాచారం. యూ ఎస్ నిఘాసంస్థలు రూపొందించిన ఓ నివేదిక ప్రకారం.. ఇస్లామాబాద్‌లోని ఉగ్రసంస్థలే లక్ష్యంగా భారత్ నిర్వ హించిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్..చైనా సహా యంతో తమ ఆయుధాలను అభివృద్ధి చేసుకోవాలని భావించింది. అందుకు అనుగుణంగానే అమెరికాలో ని పలు లక్ష్యాలను తాకగలిగే సామర్థ్యమున్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను ఆ దేశం రహస్యంగా అభివృద్ధి చేస్తోంది. అటువంటి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పాక్ అభివృద్ధి చేయాలనిగానీ, కొనుగోలు చేయాలనిగానీ ప్రయత్నిస్తే..వాషింగ్టన్ ఆదేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తుందని అగ్రరాజ్యానికి చెందిన అధికారులు పేర్కొన్నట్టు ఆ నివేదికలో వెల్లడించింది. అమెరికాకు సంభావ్య ముప్పును కలిగించే లేదా అణ్వాయుధాలు కలిగిఉన్న ఏ దేశాన్నీ అగ్రరాజ్యం తన ప్రత్యర్థిగా ప్రకటిస్తుందని తెలిపింది. నివేదిక ప్రకారం ప్రస్తుతం రష్యా, చైనా, ఉత్తర కొరియాలను అమెరికా శత్రువులుగా పరిగణిస్తోంది. కొంతకాలంగా పాకిస్థాన్ స్వల్ప, మధ్యస్థ- శ్రేణి క్షిపణులను అభివృద్ధి చేయడంపై దృష్టిసారించింది. ప్రస్తుతం ఆ దేశం దగ్గర ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు లేవు. 2022లో దాయాది దేశం భూమి ఉపరితలం నుంచి ఉపరితలం వరకు మధ్యస్థ-శ్రేణి బాలిస్టిక్ క్షిపణి షాహీన్-3ని, 2023లో మధ్యంతరశ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'మౌరీ'ని పరీక్షించింది. కాగా గతేడాది పాకిస్థాన్ లాంగ్-రేంజ్ బాలిస్టిక్-క్షిపణి కార్యక్రమానికి అగ్రరాజ్యం పలు ఆంక్షలు పెట్టింది. ఈ క్షిపణి కార్యక్రమాన్ని పర్యవేక్షించే ప్రభుత్వ యాజమాన్యంలోని రక్షణ సంస్థ నేషనల్ డెవలప్మెంట్ కాంప్లెక్స్, మరో మూడు సంస్థలతోను అమెరికన్ సంస్థలు వ్యాపారం చేయకుండా నిషేధించింది. పాక్ అటువంటి మిస్సైల్స్ తయారుచేయడం తమకు సైతం ముప్పేనని తెలిపింది. కాగా అమెరికా పక్షపాతంతో ఇటువంటి చర్యలు తీసుకుంటోందని పాక్ విమర్శలు చేసింది. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్న సమయంలో కూడా భూతలంనుంచి భూతలంపైకి తాము 450 కి.మీ. రేంజ్ అబ్దాలి వెపన్ సిస్టమ్ క్షిపణిని ప్రయోగించినట్లు ఇస్లామాబాద్ వెల్లడించింది.

# 3వేల కార్లతో నీట మునిగిన కార్గో షిప్

మెక్సికోకు 3 వేల కార్లతో వెళ్తున్న ఓ రవాణానౌక ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో మునిగిపోయింది. కొన్ని వారాల క్రితం ఈ నౌకలో మంటలు చెలరేగిన అనంతరం ఈ ఘటన చోటుచేసుకొంది. ఈ రవాణా నౌకలో మొత్తం 3వేల కార్లు ఉండగా.. అందులో 800 ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. అలస్కాలోని అలూటియన్ దీవుల వద్ద తాజాగా ఈ నౌక మునిగిపోయిందని లండన్‌కు చెందిన ఓడ నిర్వహణ సంస్థ జోడియాక్ మారిటైమ్ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే ఈ ఘటన తర్వాత అంత పెద్దగా కాలుష్యం వెలువడలేదని యూఎస్ కోస్ట్ గార్డ్ ప్రతినిధి తెలిపారు. కాలుష్య నియంత్రణ పరికరాలు కలిగిన రెండు సాల్వేజ్ టగ్లను అక్కడ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జూన్ 3న ఈ రవాణా నౌకలో అగ్నిప్రమాదం సంభవించినట్టు తమకు సమాచారం వచ్చిందని యూఎస్ కోస్ట్ గార్డ్ ప్రతినిధి తెలిపారు. ప్రమాద సమయంలో నౌకలో 22మంది సిబ్బంది ఉండగా వారందరూ లైఫ్‌బోట్స్ ద్వారా బయటపడ్డారని వివరించారు. ఆ సమయంలో సమీపంలోని మర్చంట్ మెరైన్ అనే మరో నౌక వారిని రక్షించిందన్నారు. ఓడకు వెనక భాగంలో ఎక్కువగా ఎలక్ట్రిక్ వాహనాలు ఉండటంతో పెద్దమొత్తంలో పొగలు కనిపించాయని ప్రమాద సమయంలో కోస్ట్ గార్డు అధికారులు, నౌకా సంస్థ తెలిపాయి.







బ్లో అప్

రోషిణి ప్రకాష్



# వందకోట్ల క్లబ్‌లోకి..

ధనుష్, నాగార్జున కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. జూన్ 20న చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. విడుదలైన నాటి నుంచి ఇది బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. సినిమా వసూళ్లపై తాజాగా టీమ్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటివరకూ ఇది ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకుపైగా గ్రాస్ వసూలు చేసినట్టు అంచనా అని తెలిపింది. తమ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పింది. దీనిపై సినీ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన చిత్రం 'కుబేర', రష్మిక కథానాయిక. దేవా పాత్రలో ధనుష్, దీపక్‌గా నాగార్జున నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా భిక్షగాడు పాత్రలో ధనుష్ నటనకు అంతటా ప్రశంసలు దక్కాయి.

**వరుస విజయాలు..:**

ధనుష్ ఇటీవల వరుస విజయాలు అందుకుంటున్నారు. కొవిడ్ తర్వాత ఆయన నటించిన నాలుగు చిత్రాలు



రూ.100 కోట్ల క్లబ్లోకి అడుగుపెట్టాయి. 'తిరు', 'సార్, 'రాయన్'తోపాటు తాజాగా విడుదలైన 'కుబేర ఈ జాబితాలో ఉన్నాయి. ధనుష్ నటించిన గత చిత్రం 'రాయన్' రూ.100కోట్ల బడ్జెట్‌తో రూపొందించగా రూ.150కోట్ల వరకూ వసూలు చేసిందని అంచనా. ఈ చిత్రానికి ధనుష్ దర్శకత్వం వహించడం విశేషం.

# అలాంటివారిపై చట్టబద్ధమైన చర్యలే




మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప'. మరో రెండు రోజుల్లో ఇది విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. తమ సినిమా లేదా వాటాదారుల పరువుకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. "24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మితమైన 'కన్నప్ప' జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నటీనటుల అపారమైన కృషి, భారీ బడ్జెట్‌తో అద్భుతమైన చిత్రంగా ఇది రూపొందింది. అన్నిరకాల చట్టపరమైన అనుమతులతో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. ప్రేక్షకులకు చేరువయ్యేలా బాధ్యతాయుతంగా దీనిని సిద్ధం చేశాం. విమర్శకులందరూ ముందుగా ఈ చిత్రాన్ని వీక్షించి.. అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని, ఎలాంటి పక్షపాతాలకు లొంగకుండా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరుతున్నాం. భారత రాజ్యాంగంలోని వాక్ స్వాతంత్రాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను మేము గౌరవిస్తున్నప్పటికీ.. సినిమాను కించపరిచేలా వ్యవహరిస్తే మాత్రం తప్పకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. 'కన్నప్ప'కు సంబంధించిన ఇద్దరు కీలక భాగస్వాములు, ప్రధాన నటులు మోహన్‌బాబు, మంచు విష్ణు వ్యక్తిత్వానికి, ప్రచార హక్కులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఇప్పటికే దిల్లీ హైకోర్టు వారికి రక్షణ కల్పిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వారి ఇమేజ్‌ను భంగపరిచేలా వ్యవహరిస్తే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. గతంలో జరిగిన అవాంతరాలను దృష్టిలో ఉంచుకొని బృందం అప్రమత్తమైంది" అని టీమ్ పేర్కొంది. సివిల్, క్రిమినల్, సైబర్ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. శివ భక్తుడు కన్నప్ప జీవితాధారంగా విష్ణు ఈ సినిమా కథ రాశారు. దర్శకుడు ముకేశ్‌కుమార్ సింగ్ తెరకెక్కించారు. తిన్నడు/ కన్నప్పగా విష్ణు నటించగా రుద్రగా ప్రభాస్, కిరాతగా మోహన్ లాల్, శివుడిగా అక్షయ్‌కుమార్, పార్వతిగా కాజల్ అగర్వాల్, మహదేవ శాస్త్రిగా మోహన్‌బాబు నటించారు.

# రాజకీయాలు నాకు దూరం

'మార్గన్' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పొలిటికల్ ఎంట్రీపై హీరో విజయ్ ఆంటోనీ స్పందించారు. రాజకీయాలపై తనకు పెద్దగా అవగాహన లేదన్నారు. కేవలం ఫేమ్ ఉంది కదాని రాజకీయాల్లోకి రాలేమన్నారు. "రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనే ఉద్దేశం నాకు లేదు. నటీనటులు ఏదోక సమయంలో తప్పకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనే రూల్ ఏమీ లేదు కదా. సేవ చేయాలనే ఉద్దేశంతో ఎవరైనా అడుగుపెట్టినా.. వారికి పూర్తిస్థాయిలో ప్రజల మద్దతు ఉండి తీరాలి. అలా ఉన్నప్పుడే అధికారంలోకి రాగలరు. నిజం చెప్పాలంటే, నాకు రాజకీయాలపై పెద్దగా అవగాహన లేదు. ఫేమ్ ఉందని రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి లేదు. ముందు ప్రజల సమస్యలను అర్థం చేసుకోగలగాలి" అని విజయ్ ఆంటోనీ అన్నారు.

మాదక ద్రవ్యాల కేసులో నటుడు శ్రీకాంత్ అరెస్ట్ కావడం పైనా విజయ్ మాట్లాడారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ వాడకం కొత్తేమీ కాదన్నారు. ఎంతోకాలంగా చిత్ర పరిశ్రమలో ఈ సమస్య ఉందని ఆయన ఆరోపించారు. మత్తు పదార్థాలకు చాలామంది బానిసలవుతున్నారన్నారు. శ్రీకాంత్‌కు సంబంధించిన కేసు దర్యాప్తులో ఉందని, దీనిలో నిజానిజాలు త్వరలోనే బహిర్గతమవుతాయన్నారు. విజయ్ ఆంటోనీ నటించిన లేటెస్ట్ మూవీ 'మార్గన్'. లియో జాన్‌పాల్ దర్శకత్వం వహించిన సినిమాతో విజయ్ మేనల్లుడు అజయ్ ధీషన్ ప్రతినాయకుడిగా పరిచయమవుతున్నారు. మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రంలో సముద్రఖని, దీర్షిక తదితరులు కీలక పాత్రలు పోషించారు. జూన్ 27న సినిమా విడుదల కానుంది.



# డేటింగ్ వరకూ వెళ్లలేదు



టీమ్‌ఇండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యతో తాను డేటింగులో ఉన్నట్లు కొన్నేళ్ల క్రితం జరిగిన ప్రచారంపై నటి ఇషా గుప్తా ఎట్టకేలకు స్పందించారు. కొంతకాలం తమ మధ్య స్నేహం ఉందన్నారు. అయితే తాము డేటింగ్ దశలోకి అడుగు పెట్టకముందే ముగిసిపోయిందన్నారు. "కొన్ని నెలల పాటు మేమిద్దరం మాట్లాడుకున్నాం. మా మధ్య స్నేహం ఏర్పడింది. మేమిద్దరం డేటింగ్‌లో ఉన్నామని నేను అనుకోవడం లేదు. మా మధ్య మాటలు మొదలైనప్పుడు.. డేటింగ్‌లోకి అడుగుపెట్టే అవకాశం ఉండొచ్చు, లేకపోనూవచ్చు అని ముందే ఫిక్స్ అయ్యాం. అయితే, రిలేషన్‌లోకి అడుగుపెట్టకుండానే మేమిద్దరం విడిపోయాం. రెండు, మూడుసార్లు మాత్రమే కలిశాం. కొన్ని నెలలపాటు మా మధ్య అనుబంధం కొనసాగింది. ఆ తర్వాత అది ముగిసిపోయింది" అని ఇషా గుప్తా తెలిపారు. 'కాఫీ విత్ కరణ్' షోలో మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలతో హార్దిక్ తీవ్ర విమర్శలు ఎదుర్కొవడంపైనా ఆమె స్పందించారు. "ఆ విమర్శలు నన్ను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేదు. ఎందుకంటే అప్పటికే మేమిద్దరం విడిపోయాం" అని ఆమె అన్నారు.

దర్శకుడు సాజిదాఖాన్‌తో గొడవల గురించీ ఆమె మాట్లాడారు. "సాజిద్ రూపొందించిన 'హమ్‌షకిల్స్'లో నటించా. ఆ సినిమా సమయంలో మా మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. నన్ను ఎవరైనా తక్కువ చేసి అసభ్యంగా మాట్లాడితే ఊరుకోను. ఆయన నాతో అసభ్యంగా మాట్లాడారు. నేనూ అలాగే బదులిచ్చా. ఓ రోజు సెట్‌నుంచి ఇంటికి వెళ్లిపోయా. అలాంటి సమయంలో చిత్ర నిర్మాత క్షమాపణలు చెప్పారు. తర్వాత సాజిద్ కూడా సారీ చెప్పాడు. దాంతో ఆ సినిమా కోసం వర్క్ చేశా' అన్నారు.

# ఆగస్టులో మొదలెడతారట

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ క్రేజీ కాంబినేషన్ మూవీ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర క్లాసిక్ హిట్స్‌గా నిలిచాయి. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ కాంబోలో సినిమా తెరకెక్కనుండటంతో ఈ చిత్రం ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతోందా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే సినిమాను ఆగస్టులో ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. దీంతో త్వరలో క్యాస్టింగ్‌ను ఫైనల్‌చేసి ఈ చిత్ర షూటింగ్‌ను ప్రారంభించాలని మేకర్స్ భావిస్తున్నారు. మరి ఆగస్టులో ఈ చిత్రం పట్టాలెక్కడం ఖాయమా లేదా.. అనేది వేచి చూడాలి.

